తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
సోమవారం
28 సెప్టెంబర్ 2026
పేజీలు : 8
Follow :



## కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**సిరిసిల్ల టౌన్ సెప్టెంబర్ 27 (జనంసాక్షి)**
కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మి స్పష్టం చేశారు. స్వతంత్ర సమరయోధులు, తొలి,మలిదశ తెలంగాణ ఉద్యమకారులు కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా సిరిసిల్లలోని ఆయన విగ్రహానికి మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూతెలంగాణ ఉద్యమ యోధుడు, సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను నేటి తరం, యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ సాహసోపేతంగా పోరాడారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడాల్సిందేనన్న సంకల్పంతో కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవితాన్ని ఉద్యమానికి అంకితం చేశారని తెలిపారు. ప్రజాప్రతినిధిగా, మంత్రిగా పదవుల్లో ఉన్నప్పటికీ పదవుల కంటే తెలంగాణ రాష్ట్ర సాధన, ప్రజల సంక్షేమానికే ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమాన్ని పార్టీలకు, వర్గాలకు అతీతంగా ముందుకు తీసుకెళ్లడంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆయనతో పాటు ఆచార్య జయశంకర్ వంటి మహనీయులు చూపిన మార్గంలో రాష్ట్రంలోని బలహీన వర్గాలకు పెద్దపీట వేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.సిరిసిల్ల ప్రాంతంలో చేనేత, పద్మశాలి కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. చేనేత కార్మికులు, పద్మశాలీలతో పాటు అన్ని బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నాగుల సత్యనారాయణ గౌడ్, నాయకులు కేకే మహేందర్ రెడ్డి, సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాష్, వెల్ముల స్వరూప, సూరదేవరాజు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి, దూడం శంకర్, కూరపాటి శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం కోసం ప్రజాప్రభుత్వం కృషి

**- రైతులు ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి**

**- సూపర్ ఎల్ నివో ప్రభావం**

**- ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు**

**ఎలిగేడు,సెప్టెంబర్ 27(జనంసాక్షి) :**
ఎలిగేడు మండల కేంద్రంలోని మధుర ఫంక్షన్ హాల్లో ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు సమా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో 137 వ సర్వసభ్య సమావేశానికి ప్రభుత్వ విప్ విజయ రమణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నూతనంగా ఎన్నికైన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.ముందుగా టీవీ9 సిటీకేబుల్ పాత్రికేయమిత్రులు రమేష్ మృతిపట్ల వారికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ,కేసీఆర్ కుటుంబానికే వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు.ధరణి పేరుతో పదేళ్లలో భూదోపిడీ జరిగిందని ఆరోపించారు. ధరణి వల్ల కేసీఆర్ కుటుంబానికే మేలు జరిగిందని పేదల భూములు గల్లంతయ్యాయని అన్నారు.22ఏ పై రాద్ధాంతం చేసిన బీఆర్ఎస్ నేతల ఆస్తులు బయటపడుతుంటే ఎందుకు మాట్లాడటం లేదని అన్నారు.బినామీ పేర్లతో కేసీఆర్ కుటుంబానికి ఇంకా ఎన్ని వేల కోట్ల ఆస్తులు ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. 22ఏ పరిధిలో ఉన్నది 3 లక్షల 76 వేల ఎకరాలు మాత్రమే.. కోటి ఎకరాలంటూ హరీష్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.కాళేశ్వరం నీళ్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చుక్క కూడా రాలేదని కాళేశ్వరం నీరు వచ్చినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని సవాల్ చేశారు ఎల్సూపర్ ఎల్‌నినో ప్రభావం ఉన్నందున వర్షాలపై ప్రభావం ఉంటుందని.ఖరీఫ్‌లో అవసరాల మేరకు రెండు తడులకు ఎస్సారెస్పీ నీరు అందించి పంటలను కాపాడతామని హామీ ఇచ్చారు. రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలన్నారు.అనంతరం ఎలిగేడు మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్లు డైరెక్టర్లు,పలు గ్రామాల సర్పంచ్లు,ఉపసర్పంచ్లు,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ దుర్మార్గుడు కేసీఆర్

- ఎన్నికల సంఘంలో వాడుకుంది గాంధీ కుటుంబమే
- రాహుల్ గాంధీని తప్పుదోవ పట్టిస్తుంది రేవంత్ రెడ్డే
- నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అరవింద్ ధర్మపురి

**బోధన్, సెప్టెంబర్ 27 ( జనంసాక్షి ) :**
లక్ష రూపాయల రుణమాఫీ చేస్తానని, ఎన్నో వాగ్దానాలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిన దుర్మార్గుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అరవింద్ ధర్మపురి ఆరోపించారు. ఆదివారం బోధన్ పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బోధన్ నుండి జగిత్యాల వరకు చేపట్టనున్న సైకిల్ యాత్రను ఎంపీ అరవింద్ ధర్మపురి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో **వార్తా లోపలి పేజీలో**



## విధుల్లో కానిస్టేబుల్..
## పరుగులోనూ సత్తా చాటిన మారథాన్ హీరో

**తొలిసారి హాఫ్ మారథాన్‌లో పాల్గొని 21.32 కి.మీ.ను 2 గంటల 6 నిమిషాల్లో పూర్తి చేసిన పెద్దవాల్గొట్ యువకుడు**

**సిరికొండ , సెప్టెంబర్ 27 (జనంసాక్షి ):**
వృత్తిరీత్యా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే పరుగుపై ఉన్న మక్కువతో మారథాన్‌లో పాల్గొని సిరికొండ మండలం పెద్దవాల్గొట్ గ్రామానికి చెందిన కొలిప్యాక్ శ్రావణ్ గౌడ్ ప్రతిభ చాటారు. కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించిన మారథాన్‌లో ఆయన తొలిసారిగా హాఫ్ మారథాన్‌లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు.శ్రావణ్ గౌడ్ 21.32 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌ను కేవలం 2 గంటల 6 నిమిషాల్లో పూర్తి చేశారు. కిలోమీటరుకు సగటున 5.55 నిమిషాల వేగంతో పరుగెత్తి నిర్ణీత దూరాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. తొలిసారిగా మారథాన్‌లో పాల్గొన్నప్పటికీ ఇంత దూరాన్ని తక్కువ సమయంలో పూర్తి చేయడం విశేషంగా నిలిచింది.పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రావణ్ గౌడ్‌కు పరుగుపై ప్రత్యేక ఆసక్తి ఉంది. విధి నిర్వహణలో శారీరక దారుఢ్యానికి ప్రాధాన్యం ఉండటంతో పాటు వ్యక్తిగత ఆసక్తితోనూ పరుగును సాధనగా కొనసాగిస్తున్నారు. విధుల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తనకు ఇష్టమైన పరుగును కొనసాగిస్తూ, తొలిసారిగా మారథాన్ పోటీలో పాల్గొని తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. హాఫ్ మారథాన్‌లో 21.32 కిలోమీటర్ల దూరాన్ని 2 గంటల 6 నిమిషాల్లో పూర్తి చేసి తన అత్యుత్తమ సమయాన్ని నమోదు చేసుకోవడంతో శ్రావణ్ గౌడ్ కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. తొలి ప్రయత్నంలోనే మంచి సమయంతో పరుగు పూర్తి చేసినందుకు ఆయనను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని మారథాన్ పోటీల్లో పాల్గొని మరింత మెరుగైన సమయాలను నమోదు చేయాలని ఆకాంక్షించారు.





## ఎంపీ అరవింద్ ను సన్మానించిన నియోజకవర్గ బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు

**బోధన్, సెప్టెంబర్ 27 ( జనంసాక్షి ) :** కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సైకిల్ యాత్రలో భాగంగా బోధన్ కు వచ్చిన నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు అరవింద్ ధర్మపురిని బోధన్ నియోజకవర్గంలోని బిజెపి మండల అధ్యక్షులు ఘనంగా సన్మానించారు. బోధన్ పట్టణం, బోధన్ మండలం, సాలూరు మండలం, ఎడపల్లి మండలం, రెంజల్ మండలం, నవీపేట మండలంకు సంబంధించిన గోపి, సిర్ప సుదర్శన్, రావుబా గంగాధర్, కోల ఇంద్రకరణ్, యోగేష్, నరిన్ లు ఎంపీ అరవింద్ ధర్మపురికి నాగలిని అందించడంతో పాటు ఘనంగా సన్మానించారు.

## టీఆర్ఎస్ సిద్ధాంతాలకు ఆకర్షితులై భారీగా చేరికలు

### కవితక్కను ముఖ్యమంత్రిగా చూడడమే లక్ష్యం: సుమలత శర్మ, మజీద్



**గంభీరావుపేట, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** తెలంగాణ రక్షణ సేన అధినేత, టీఆర్ఎస్ పార్టీ నాయకురాలు కవితక్క సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో భారీగా చేరికలు జరుగుతున్నాయని రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు సంకెపెల్లి సుమలత శర్మ, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి మజీద్ అన్నారు. గంభీరావుపేట మండలం గోరింటాల గ్రామంలో నియోజకవర్గ యువజన నాయకుడు సయ్యద్ జావిద్, మండల అధ్యక్షులు కూర సురేష్ మరియు గ్రామ శాఖ నాయకుడు బందెల రాజు ఆధ్వర్యంలో పలువురు టీఆర్ఎస్ లో చేరారు. వారికి సుమలత శర్మ, మజీద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కవితక్క ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న ఉద్యమాలకు ఆకర్షితులై రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛందంగా ప్రజలు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కవితక్కను ముఖ్యమంత్రిగా చూడడమే తమ లక్ష్యమని చేరికల సందర్భంగా పలువురు పేర్కొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కూర సురేష్, సంకెపెల్లి సుధాకర్ శర్మ, మార్వాడి దేవరాజు, బైరి రాజేష్, కొర్రి రమేష్, సిద్ధూ, చరణ్, సతీష్, కదిరే రేణుక, ఆకారం పుష్పలత, ముత్తవ్వ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

**మంథని, సెప్టెంబర్ 27, (జనంసాక్షి) :** ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్ బాబును కలిసి మంథని ప్రాంతానికి సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంథని ప్రాంత అభివృద్ధి, ప్రజలకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి శ్రీధర్ బాబు కు వివరించినట్లు కొత్త శ్రీనివాస్ తెలిపారు. సమస్యలను సావధానంగా విన్న మంత్రి వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

## అక్షరాస్యతతో మహిళలకు ఆత్మవిశ్వాసం

### అమ్మకు అక్షరమాల ఉల్లాస్‌లో 270 మంది మహిళలకు రాత పరీక్షలు



**గంభీరావుపేట, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టు పీజీ విద్యాలయంలో సెర్ప్ ఆధ్వర్యంలో 'అమ్మకు అక్షరమాల ఉల్లాస్' కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు రాత పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో మండలంలోని వివిధ మహిళా సంఘాలకు చెందిన సుమారు 270 మంది మహిళలు పాల్గొన్నారు. చదవడం, రాయడం, సులభమైన లెక్కలు చేయడం వంటి అంశాలపై పరీక్ష నిర్వహించారు. మహిళల్లో అక్షరాస్యత స్థాయిని తెలుసుకోవడంతో పాటు, రోజువారీ జీవితంలో అవసరమైన సమాచారాన్ని స్వయంగా చదివి అర్థం చేసుకునేలా శిక్షణ ఇవ్వడం కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. తమ సంఘాల్లో జమ అవుతున్న నగదు, ఖాతాల్లో ఉన్న నిల్వలను తెలుసుకోవడంతో పాటు బస్సుల వివరాలు, ఇతర అవసరమైన సమాచారాన్ని చదివే సామర్థ్యం పెంపొందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జయసుధ, సీసీలు ఏడబోయిన బాబు, సురేందర్, సీఏలు, వీవోలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ దుర్మార్గుడు కేసీఆర్

ఎంపీ మాట్లాడుతూ, లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ఎన్నికల కోసం కెసిఆర్ కనీసం మరమ్మత్తుల సైతం చేపట్టలేదని ఆరోపించారు. మాజీ మంత్రి కేటీఆర్ ఏం మొహం పెట్టుకొని ఓట్లు అడిగినందుకు ప్రజల దగ్గరికి వెళ్లారని ఆయన ప్రశ్నించారు. బోధన్ నిజాం చక్కెర ఫ్యాక్టరీని ప్రభుత్వ పరం చేస్తామని హామీ ఇచ్చిన కల్వకుంట్ల కుటుంబం ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారని ఆయన అన్నారు. కెసిఆర్ ఫామ్ హౌస్ లో కోట్లాది రూపాయలు విలువ చేస్తే పంటలు పండిస్తుండగా సామాన్య రైతులు మాత్రం కేవలం వరి పంటనే వేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన అన్నారు. ఎన్నికల సంఘం అధికారుల్లో ఒకరు వ్యతిరేకంగా ఉండొచ్చు అనే విషయం కాంగ్రెస్ నాయకులకు గాంధీ కుటుంబం నుండి తెలవకపోవడం సిగ్గుచేటు అన్నారు. అవేమీ పట్టించుకోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సంఘంను తప్పు పట్టడం సమంజసం కాదన్నారు. రాహుల్ గాంధీని తప్పుదోవ పట్టించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పబ్బం గడుపుతున్నారని ఈ విషయం సహచర మంత్రులకు సైతం పూర్తిగా తెలుసన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం నెరవేర్చడంలో భాగంగా ప్రజలను చైతన్య పరిచేందుకు కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమని, ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండ కట్టాలని ఎంపీ అరవింద్ ధర్మపురి సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డీ మోహన్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తిరుపతి, బోధన్ పట్టణ బిజెపి కౌన్సిలర్లు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి సేవలో హీరో వరుణ్ తేజ్



**మల్యాల సెప్టెంబర్ 27 (జనం సాక్షి)** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టు ఆంజనేయస్వామిని ఆదివారం ఆంజనేయ స్వామి దీక్ష తీసుకున్న హీరో వరుణ్ తేజ్ దర్శించుకున్నారు. వరుణ్ తేజ్ తో పాటు కొరియన్ కనకరాజు సినిమా దర్శకుడు మేర్లపాక గాంధీ,హాస్యనటుడు సత్యా కూడా హనుమాన్ దీక్షలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఈవో అధికారులు హీరో వరుణ్ తేజ్ కు ఘన స్వాగతం పలికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. ఈవో శాలువాతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. హీరో వరుణ్ తేజ్ మాట్లాడుతూ బాబాయ్ పవన్ కళ్యాణ్ కు ఆంజనేయ స్వామి అంటే అపారమైన భక్తి నమ్మకం అని తను చెప్పడం వల్లే స్వామి వారి దీక్షలో దర్శించుకున్నానని స్వామివారిని దర్శించుకోవడం తనకు చాలా ఆనందంగా ఉందని స్వామివారి కృప తనపై ఉండాలని కోరుకున్నానని తెలిపారు. ఆలయ ఈవో అంజనారెడ్డి,ఎస్సై సందీప్, వేద పండితులు,అర్చకులు,ఆలయ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బహిరంగ సభకు మహిళలు తరలి రావాలి:అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపు

**సిరిసిల్ల టౌన్ సెప్టెంబర్ 27 (జనం సాక్షి)** ఈనెల 30న సిరిసిల్లలో జరిగే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బహిరంగ సభకు మహిళా సమైక్య సంఘ సభ్యులు తరలిరావాలని మంత్రి అడ్లూరు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సిరిసిల్లలోని సినారె కళామందిర్ లో సమైక్య మహిళా సంఘ సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టితోనే సిరిసిల్లకు ముఖ్యమంత్రి రావడం జరుగుతుందని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ఒక ఆలోచన ఆయనను ఇక్కడికి వచ్చేలా చేసిందని ప్రస్తావించారు 22,000 మంది సభ్యులు ఉన్న మహిళా



సోదరీమణులు ఆయన వస్తున్న సందర్భంగా ప్రత్యేకంగా ఎన్ని పనులున్నా పక్కన పెట్టి స్వాగతం పలకాలని కోరారు. ప్రతి ఒక్క సభ్యురాలు సభకు హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆ శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు నాగుల సత్యనారాయణ గౌడ్ కేకే మహేందర్ రెడ్డి, సంగీతం శ్రీనివాస్, వెల్ముల స్వరూప మహిళా సంఘ సభ్యురాలు తదితరులు పాల్గొన్నారు.

## విలువల పరిరక్షణకు ప్రవక్త జీవితం ఆదర్శం

### ◆సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ◆ సీరత్ ఎక్స్ పోలో స్టాల్స్ సందర్శన



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** ఆధునిక సమాజంలో పెరుగుతున్న నేరాలు, మాదకద్రవ్యాల వ్యసనం, సైబర్ మోసాలు, మహిళల పై అఘా యిత్యాలను అరికట్టి, మానవీయ నైతిక విలువలను పెంపొందించాలనే లక్ష్యంతో జమాత్ ఎ ఇస్లామి హింద్ , కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో "సీరత్ క్యాంపెయిన్ 2026" ఎంతగానో దోహదపడుతుందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఎక్స్పోలో ఏర్పాటు చేసినటువంటి 50 రకాల స్టాల్స్ ను నరేందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రవక్త ముహమ్మద్ (సల్ల ల్లాహు అలైహి వసల్లం) వారి ఆదర్శ జీవితం ద్వారా శాంతి, నైతికత, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం జమాతే ఇస్లామీ హింద్ విశేషంగా కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా సుడా మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డిని జమాతే ఇస్లామీ హింద్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

# ఆదర్శంగా నిలిచిన మూడు తరాల ఆత్మీయ సమ్మేళనం

◆తరాలు మారినా తరగని అనురాగం,ఆప్యాయత

◆ రేకొండ విలాసాగరం కుటుంబ సభ్యుల వనభోజనాలు

**చిగురుమామిడి సెప్టెంబర్ 27(జనంసాక్షి):** ఒకటి రెండు కుటుంబాలు కూడా కలిసి ఉండలేక చిన్నభిన్నమవుతున్న నేటి ఆధునిక కాలంలో,ఆ కుటుంబం మాత్రం సమాజానికి ఒక గొప్ప ఆదర్శంగా నిలిచింది. తరాలు మారినా తమ మధ్య ఉన్న ఆప్యాయత,అనురాగం చెక్కుచెదరలేదని నిరూపించింది.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన విలాసాగరం వీరమల్లు కనకవ్వల కుటుంబ సభ్యులు ఆదివారం నాడు మూడు తరాల పిల్లలతో కలిసి ఘనంగా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. కుటుంబంలోని దాదాపు 150మంది సభ్యులు ఒకే చోటికి చేరుకుని సుందరగిరి శ్రీరేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడి తాటి వనంలో ఏర్పాటు చేసిన వనభోజనాల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. మూడు తరాల పిల్లలు,పెద్దలు ఒకే దగ్గర చేరి సహపంక్తి భోజనాలు చేస్తూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సంతోషంలోనే కాకుండా, ఎలాంటి ఆపద వచ్చినా తామంతా ఒక్కటేనంటూ తమ ఐక్యతను చాటారు. రోజంతా ఆటపాటలు, ముచ్చట్లతో సాగిన ఈ వనభోజనాల కార్యక్రమం స్థానికంగా అందరినీ ఆకట్టుకోవడమే కాకుండా, నేటి తరానికి ఉమ్మడి కుటుంబాల ప్రాముఖ్యతను చాటిచెబుతూ ఆదర్శంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో విలాసాగరం రామకృష్ణయ్య, బొందయ్య, నరసయ్య, నారాయణ,తిరుపతి, చిలుకవ్వ,లక్ష్మి, విలాసాగరం అంజయ్య, మురళీమోహన్, గిరిధర్,విక్రం,రవీందర్,శ్రీధర్,శ్రీనివాస్,సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.







## ఉల్లాస్ పరీక్షలకు వంద శాతం నమోదు

### మండల ఐకెపి ఏపీఎం రాజేందర్

**ఎడపల్లి, సెప్టెంబర్ 27 ( జనంసాక్షి ) :** డ్వాక్రా సంఘంలోని మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న ఉల్లాస్ పరీక్షలకు వంద శాతం నమోదు అయినట్లు ఎడపల్లి మండల ఐకెపి ఏపిఎం రాజేందర్ స్పష్టం చేశారు. ఆదివారం ఎడపల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో డ్వాక్రా మహిళలకు రెండవ విడత ఉల్లాస్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడపల్లి మండల ఐకెపి ఏపిఎం రాజేందర్ మాట్లాడుతూ, నిరక్షరాశులయిన నిరక్షరాస్యులైన డ్వాక్రా మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నారు. గత సంవత్సరం నిర్వహించిన పరీక్షలను నేడు రెండో విడత నిర్వహించడం జరుగుతుందని మండలంలో 975 మంది మహిళలు ఉల్లాస్ పరీక్షలను రాయడం జరిగిందని తద్వారా వంద శాతం హాజరు నమోదు అయిందని ఆయన వివరించారు. ఈ పరీక్షలు ప్రభుత్వం చేపట్టినందున ప్రతి దాంట్లో గుర్తింపు ఉండడం త పాటు పోటీ పరీక్షలకు సైతం అర్హత ఉంటుందని అలాగే ఉన్నత చదువులు చదివేందుకు సైతం ఈ పరీక్షల ఫలితాలు దోహదం చేస్తాయని ఏపీఎం రాజేందర్ వివరించారు. ఈ కార్యక్రమంలో సంధ్యారాణి, సిఏలు, మహిళలు పాల్గొన్నారు.

## రాయికల్‌లో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

**రాయికల్ సెప్టెంబర్ జనం సాక్షి :** రాయికల్ పట్టణంలోని శ్రీ చెన్నకేశవనాథ పంచముఖ లింగేశ్వర సూర్యనారాయణ స్వామివారి త్రికుటాలయం (గుడికోట)లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాశస్త్యాన్ని వివరించారు.

**గడి పాఠశాల పూర్వ విద్యార్థినికి మెడల్స్ అందజేత**

ప్రాథమిక పాఠశాల ఎస్ ఆర్ ఎస్ పి క్యాంప్ గడి, కల్లూరు రోడ్, కోరుట్ల పూర్వ విద్యార్థిని అల్లే రక్షా పెయింటింగ్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన సందర్భంగా జిల్లా విద్యాధికారి కె. రాము చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసాపత్రం అందుకున్నారు.ప్రధానోపాధ్యాయులు సునావత్ రాజు విద్యార్థినీ అభినందించారు.ఇట్టి కార్యక్రమంలో ఆర్ యు పి పి టి ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ పాల్గొన్నారు.





## ప్రధాని నరేంద్ర మోడీ 25 ఏళ్ళ పరిపాలనకు నిదర్శనం సేవా సంకల్ప అభియాన్

### రక్తదానం శిబిరాన్ని ప్రారంభం చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** ప్రధాని నరేంద్ర మోడీ సుదీర్ఘకాలంగా దేశానికి, ప్రజలకు అందిస్తున్న నిరంతర సేవ ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. 25 సంవత్సరాల ప్రజా సేవ పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకుని చేపట్టిన 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలోని ఎస్బిఎస్ ఫంక్షన్ హాల్ లో బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావుతో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభం చేశారు. అనంతరం రక్తదానం చేసిన పలువురు బీజేవైఎం నాయకులకు పండ్ల రసం అందించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... మానవత్వంతో చేసే రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆశయాలకు అనుగుణంగా బీజేవైఎం నాయకులు, యువకులు, మోడి అభిమానులు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. మోదీ ఆశయాలకు అనుగుణంగా యువత సామాజిక సేవలో ముందుండాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపి కార్పోరేటర్లు చొప్పరి జయశ్రీ, పొన్నం లక్ష్మీ మొండయ్య, మాసం గణేష్, గాజ రమ శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్ , బీజేపి నాయకులు గుజ్జ శ్రీనివాస్, అవదుర్తి శ్రీనివాస్, చంద్రమౌళి, ఆనంద్, శివరాజ్, గాయత్రి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల విధులకు ఆటంకం.. ఇద్దరిపై కేసు

### వాహన తనిఖీల సందర్భంగా వాగ్వాదం.. దర్యాప్తు కొనసాగింపు

**గంభీరావుపేట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** గంభీరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సముద్రలింగాపూర్ గ్రామ శివారులో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 26న సాయంత్రం సుమారు 7:30 గంటలకు పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా టీఎస్-02-ఇఖ్-2553 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని ఆపారు. వాహన పత్రాలు చూపించాలని కోరగా వాహనం నడుపుతున్న మోతె ఉపేందర్, అతని తల్లి మోతె నిర్మల పోలీసులతో వాగ్వాదానికి దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ వివరాలు వెల్లడించేందుకు నిరాకరించడంతో పాటు పోలీసు సిబ్బందిని బెదిరించినట్లు తెలిపారు. ఉపేందర్ కానిస్టేబుల్ చేతిలోని ట్యాబ్‌ను తోసివేసి విధులకు ఆటంకం కలిగించినట్లు, నిర్మల కూడా దురుసుగా ప్రవర్తించి న్యూసెన్స్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రధాన రహదారిపై సుమారు 30 నిమిషాల పాటు పోలీసుల విధులకు అంతరాయం కలిగించినట్లు తెలిపారు. ఈ ఘటనపై గంభీరావుపేట పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానం

**కోరుట్ల సెప్టెంబర్ 27 జనం సాక్షి :** కథలాపూర్ మండల కేంద్రంలోని కళాధార పాఠశాలలో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న కమలాకర్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైనందుకు ట్రస్మా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కమలాకర్ మాట్లాడుతూ ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించడం ద్వారా ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఉత్సాహం ఉంటుందని, విద్యార్థులకు బోధన చేయడంలో ముందు ఉంటారని అన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ డీఈఓ రాము లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





## కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూల మాల నివాళులు అర్పించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ అని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ లో తెలంగాణ తొలితరం ఉద్యమ నేత ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ చౌరస్తాలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బాపూజీ దేశం, తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సంధర్బంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... కొండ లక్ష్మణ్ బాపూజీ చూపిన ఆశయాలు, త్యాగనిరతి నేటి తరానికి ఎంతో స్ఫూర్తి దాయకం అన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో



బాపూజీ పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 ఉద్యమంలో తన మంత్రి పదవిని తృణప్రాయంగా త్యాగం చేసిన నిబద్ధత కలిగిన గొప్ప నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పడిశెట్టి వసంత లక్ష్మీ భూమయ్య, కార్పోరేటర్లు వాసాల రమేష్, మాసం గణేష్, చొప్పరి జయశ్రీ వేణు, వేముల కవిత చంద్రశేఖర్, పద్మశాలి సంఘం నాయకులు మెతుకు సత్యం తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ మొదటి వారంలో మలిదశ ఉద్యమం

## రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలి: కోహెడ చంద్రమౌళి

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి)**

రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెన్షన్ సంబంధిత బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ మొదటి వారంలో మలిదశ ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి తెలిపారు. ప్రభుత్వం బకాయిల చెల్లింపులో జాప్యం చేస్తూ రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన అన్నారు.కరీంనగర్ ఫిలిం భవన్‌లో ఆదివారం రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం ఏడాది కాలంలో చేపట్టిన కార్యక్రమాలు, రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా కోహెడ చంద్రమౌళి మాట్లాడుతూ.. ప్రభుత్వం 100 రోజుల్లో రూ.6 వేల కోట్లను రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం మంజూరు చేసి చేతులు దులుపుకుందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 27 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందగా, వారికి జీపీఎఫ్, జీఐఎస్, టీజీఎల్ఐ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్ తదితర బకాయిలు రావాల్సి ఉంద న్నారు. ఇప్పటివరకు జీపీఎఫ్, కమ్యూటేషన్ మా త్రమే చెల్లించారని, మిగిలిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. రెండున్నరేళ్లుగా బకాయిలు అందక రిటైర్డ్ ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనారోగ్యానికి గురైన పలువురు మెరుగైన వైద్యం పొందలేక మృతి చెందారని పేర్కొంటూ, మృతి చెందిన రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను




వడ్డీతో సహా ఏకమొత్తంగా చెల్లించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే అక్టోబర్ మొదటి వారంలో మలిదశ ఉద్యమాన్ని ప్రారంభించి మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల ప్రభాకర్‌రావు మాట్లాడుతూ సంఘం ఏర్పాటై ఏడాది పూర్తయిందని, ఈ కాలంలో రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. ఆ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం కొంతమేర స్పందించి రెండు పద్ధతుల్లో బకాయిలను చెల్లించిందన్నారు. అనంతరం ఏడాది కాలానికి సంబంధించిన కార్యదర్శి నివేదికను సమావేశంలో ప్రవేశపెట్టారు.ఆర్థిక కార్యదర్శి కనపర్తి దివాకర్ ఆర్థిక నివేదికను సమర్పిస్తూ బకాయిల చెల్లింపులో జాప్యం కారణంగా రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి గంద్ర రవీందర్‌రావు మాట్లాడుతూ హెల్త్ కార్డుల అమలు సక్రమంగా లేక ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఆస్పత్రుల్లో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం హెల్త్ కార్డుల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆయిల్నేని నరేందర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎన్నం రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం జేఏసీతో జరిపిన చర్చల్లో రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలకు తగిన ప్రాధాన్యం లభించలేదన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.2 వేల కోట్లు కేటాయించాలని కోరారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు వంగ సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించే డీఏ బకాయిలను విడతల వారీగా కాకుండా ఒకేసారి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్దపల్లి జిల్లా ఉపా ధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ఈహెచ్‌ఎస్ కార్డులు ఆస్పత్రుల్లో సక్రమంగా అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు గద్దె జగదీశ్వరా చారి, భారతి, ఉమారాణి, కత్రోజు ప్రభాకర్, బూరుగుపల్లి రవీందర్, పేర్యాల భాస్కరరావు, బుర్ర సుధాకర్, నయీముద్దీన్, అల్తాఫ్ అహ్మద్, నసిరుద్దీన్, లక్ష్మీనారాయణ, దుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.




## అలీ సాగర్ ఉద్యానవనంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

ఎడపల్లి, సెప్టెంబర్ 27 ( జనంసాక్షి ) :

ఎడపల్లి మండలం అలీ సాగర్ ఉద్యానవనంలో ఆదివారం జిల్లా టూరిజం శాఖ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల గురుకుల పాఠశాల చెందిన విద్యార్థులను టూరిజం శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు టూరిజం ప్రాంతాలను చూపించి అలీ సాగర్ ఉద్యానవనంలో బోటింగ్ కల్పించారు. అనంతరం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నిజామాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ భుజంగరావు చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఎన్నో పర్యటక ప్రాంతాలు ఉన్నాయని ఆ ప్రాంతాల ప్రాముఖ్యతను తెలుసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ అధికారి పవన్ కుమార్, అలీ సాగర్ చైతన్య యువజన సంఘం ప్రతినిధులు విఠల్ గౌడ్, అరవింద్, విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చూసి ఓర్వలేకనే అసత్యపు ఆరోపణలు

**మంథని, సెప్టెంబర్ 27,(జనంసాక్షి) :**

అబద్ధపు ప్రచారాలను ప్రజల గమనిస్తున్నారు అని, మంత్రి శ్రీధర్ బాబు చేస్తున్నఅభివృద్ధి చూసి ఓర్వలేకనే మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం మంథని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్ ఏర్పాటుచేసిన పత్రిక సమావేశంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ చేసినటువంటి వ్యాఖ్యలను ఖండించారు. ఈ పాత్రికేయుల సమావేశంలో మంథని మండల అధ్యక్షులు ఆయిలి ప్రసాద్, ఎలక్ట్రిసిటీ బోర్డ్ మెంబర్ శశిభూషణ్ కాచే, మున్సిపల్ చైర్మన్ వోద్నల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, మాజీ మున్సిపల్ చైర్మన్ పెంద్రు రమ, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పైన అనుచిత వైఖ్యాలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. గత పది సంవత్సరాల కాలంలో ఎంత మేరకు అభివృద్ధి జరిగిందో ప్రజలందరూ గమనించారని గుర్తు చేశారు. ప్రతిపక్ష నాయకులు ఇష్టరాజ్యంగా అబద్ధపు ప్రచారాలు చేసుకుంటూ పబ్బం గడుపుతున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అక్కడ కేసీఆర్ఇక్కడ నాయకులు భూములు సంపాదించుకుంటూ ప్రజల్ని మోసం చేశారని అన్నారు. అలాంటి నాయకులు మంత్రి శ్రీధర్ బాబు భూములపై మాట్లాడుతుంటే విడ్డూరంగా ఉందని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు భూములు పంచే వ్యక్తిగా ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేస్తూ ముందుకు వెళ్తున్నారని అన్నారు. వారికి ప్రజల బాగోగులు తప్ప ఎలాంటి



కబ్జాలు చేయలేదని బహిరంగంగా తెలుపుతున్నాము అని ముక్తకంఠంగా పేర్కొన్నారు. దళిత మూడెకరాల భూమి అనే హామీలు ఇచ్చారు తప్ప, దళితుల భూములు గుంజుకున్న గత ప్రభుత్వ నాయకులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా మహనీయులకు పెద్దపీట వేసిందని వారి జయంతి వర్ధంతులకు సంబంధించి ప్రతి ఒక్క కార్యక్రమాన్ని ప్రజా ప్రభుత్వం వారికి ఘన నివాళులు అర్పిస్తూ వారి ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. ప్రభుత్వం పథకాల పైన, కాంగ్రెస్ ప్రభుత్వం పైన అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రజల సంక్షేమం కోసం నిత్యం పనిచేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు. ఈ ప్రాంత విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దే ప్రయత్నంలోనే మంత్రి శ్రీధర్ బాబు ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ సౌకర్యం కల్పిస్తున్న సంగతి వారు గుర్తు చేశారు. ఈ ప్రాంత ప్రజల కోసం మంత్రి శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు పరితపిస్తున్నట్లు వారి పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులను తప్పుదోవ పట్టిస్తే, వారే ప్రతిపక్ష నాయకులకు బుద్ధి చెప్తారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఆర్టీసీ నష్టాలలో ఉండగా ప్రస్తుతం లాభాల్లో ఉందని స్వయంగా ఆర్టిసి అధికారుల ప్రకటించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## టీఎంయూ(ఏ), టిడబ్ల్యూయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఐక్య కూటమి ఎన్నికల కమిటీ ఏర్పాటు

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 27, ( జనం సాక్షి)**

టీఎంయూ(ఏ), టిడబ్ల్యూయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘాల ప్రధాన నాయకులతో కరీంనగర్ రీజియన్‌లో ఐక్య కూటమి ఎన్నికల సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీకి వీరగాని శ్రీనివాస్‌ను చైర్మన్‌గా, రాపెల్లి రాజయ్యను వైస్ చైర్మన్‌గా, వై.ఎస్.రెడ్డిని కన్వీనర్‌గా, కదరి అంజిరెడ్డిని ట్రెజరర్‌గా ఎన్నుకున్నారు. కో–కన్వీనర్లుగా రాణా ప్రతాప్‌సింగ్, ములుగూరి రాజయ్య, గౌంటి కోటేశ్వర్, అడ్వైజర్‌గా ఆర్.మొండయ్యను నియమించారు.తెలంగాణ ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియలో కూటమి కీలక పాత్ర పోషిస్తుందని నాయకులు తెలిపారు. తెలంగాణ మోడల్‌లో కార్మికులు ప్రస్తుతం అనుభవిస్తున్న హక్కులకు ఎలాంటి నష్టం కలగకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కమిటీకి సమర్పించిన ప్రతిపాదనలను అమలు చేయించి డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.కార్మికులు ఎదుర్కొంటున్న పని భారాన్ని తగ్గించడంతో పాటు పని పరిస్థితులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. కరీంనగర్ రీజియన్‌లో కూటమికి మద్దతు ఇవ్వాలని, వైట్ కలర్ బ్యాలెట్, పింక్ కలర్ బ్యాలెట్‌లపై బాణం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆర్టీసీ కార్మికులను కోరారు.

# కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం

## కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పిఐసి చైర్మన్ గడ్డం విలాస రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం ఆదివారం రోజు కరీంనగర్ రెవెన్యూ గార్డెన్ లో నిర్వహించారు. బ్యాంక్ పీఐసీ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బ్యాంక్ నిర్వహణకు సంబంధించిన ఎజెండాను సభ్యుల ఏకగ్రీవ ఆమోదంతో ఆమోదించారు. ఈ సందర్భంగా కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పిఐసి చైర్మన్ గడ్డం విలాస రెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 13న సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించి నప్పటికీ, అవసరమైన కోరం సభ్యులు హాజరు కాకపోవడంతో సమావేశం నిర్వహించలేక పోయామని, ఆ రోజు ప్రకటించిన విధంగా అనుసంధానంగా ఆదివారం రోజు సమావేశం నిర్వహించి బ్యాంక్ నిర్వహణకు సంబంధించిన ఎజెండా పై చర్చించి ఆమోదం తీసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంక్ సీఈవో నునుగొండ శ్రీనివాస్, పీఐసీ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డితో పాటు మడుపు మోహన్, ముక్క భాస్కర్, ముద్దసాని క్రాంతి, మూల లక్ష్మి, ఇ. లక్ష్మణ రాజు, ఎ.విద్యాసాగర్, రేగొండ సందీప్, ఎం.డి. షాముద్దీన్, మంగి రవీందర్, నాగుల సతీష్, మార్కా రాజు, బ్యాంక్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారం కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు పాదయాత్ర

**ఇల్లంతకుంట (జనంసాక్షి):** మండలంలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు పాదయాత్ర చేపట్టారు. మండలంలో నెలకొన్న రోడ్ల సమస్య, బస్సు సౌకర్యం, ఓబులాపురం కెనాల్ పనులు, అనంతారం బ్రిడ్జి నిర్మాణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటికి శాశ్వత పరిష్కారం కల్పించాలనే ఉద్దేశంతో ఈ పాదయాత్ర చేపట్టినట్లు అఖిలపక్ష నాయకులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# వివాహిత మిస్సింగ్ కేసు నమోదు



**మల్యాల సెప్టెంబర్ 27 (జనంసాక్షి)** తాటిపెల్లి గ్రామం కొంపల్లికి చెందిన పత్రి సంగీత వివాహిత సెప్టెంబర్ 27వ తేదీ ఆదివారం ఉదయం నుండి కనిపించడం లేదని మల్యాల కేసు నమోదు అయింది,పత్రి సంగీత భర్త రాజశేఖర్ తో 8 సంవత్సరాల క్రితం వివాహమైంది ఇద్దరు పిల్లలు ఉన్నారు.రాజశేఖర్ 26వ తేదీ శనివారం ఉదయం పనిమీద నిజాంబాద్ కు వెళ్లగా భార్య పిల్లలకు తోడుగా తన తల్లి అయిన పత్రి లక్ష్మి తోడుగా పడుకుందని,శనివారం రాత్రి 8:30 గంటల సమయంలో పిల్లలతో సహా భోజనం చేసి నిద్రించగా ఆదివారం రోజున ఉదయం అందాల 3:30 గంటల సమయంలో తన పత్రి లక్ష్మి బాత్రూంకి వెళ్ళడానికి లేవగా సంగీత కనబడలేదని కొడుకు రాజశేఖర్ కి ఫోన్ చేసి చెప్పగా ఇంటికి వచ్చి చుట్టుపక్కల బంధువుల ఇండ్లలో మరియు చుట్టుపక్కల గ్రామాలలో వెతకగా కనబడకపోయేసరికి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

## ఇటీవల మరణించిన కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

**రుద్రంగి సెప్టెంబర్ 27 ( జనంసాక్షి)** మానల గ్రామం, పరిసర తండాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పర్యటించారు. ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయిన పలువురు ఆత్మీయులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.మానల గ్రామానికి చెందిన మెడికల్ శ్రీనివాస్ తల్లి, సర్పంచ్ తండాకు చెందిన మాలోత్ బాసు, ప్రమాదవశాత్తు మృతి చెందిన రూప్ల తండా గ్రామ శాఖ అధ్యక్షుడు భూక్యా చందర్ నాయక్, రూప్ల తండా మాజీ సర్పంచ్ భూక్యా రాజు నాయక్ తల్లి, అడ్డబోర్ తండా మాజీ సర్పంచ్ మోహన్ అన్న బాపూరావు, వీరుని తండా సీనియర్ నాయకులు గుగులోత్ వర్జ్య భార్య సుబ్బమ్మల కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రుద్రంగి మండల అధ్యక్షులు, సర్పంచ్ తిరుపతి నాయక్, మానల సర్పంచ్ శంకర్ గౌడ్, సొసైటీ చైర్మన్ చిన్నారెడ్డి, రాజారామ్, నరహరి నాయక్, నరు నాయక్, బడితండా సర్పంచ్ రాందాస్, జూల భూమన్న, మాజీ సర్పంచ్‌లు, అన్ని తండాల గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జేరిపోతుల శ్రీనివాస్ కు అంబేద్కర్ నేషనల్ అవార్డు..

## నేషనల్ అవార్డు రావడం పట్ల పలువురి హర్షం..




**చిగురుమామిడి సెప్టెంబర్ 27(జనంసాక్షి):** మండలంలోని ఉల్లంపల్లి గ్రామానికి చెందిన డా.అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జేరిపోతుల శ్రీనివాస్ అంబేద్కర్ నేషనల్ అవార్డుకి ఎంపిక అయ్యారు.ఈ మేరకు ఆదివారం హైదరాబాదులోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయం లో జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ అవార్డు ఎంపిక పత్రాన్ని శ్రీనివాస్ కు అందజేశారు.ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ శ్రీనివాస్ గత రెండు దశాబ్దాలుగా అంబేద్కర్ యువజన సంఘంలో పనిచేస్తూ అంబేద్కర్ సిద్ధాంతాన్ని అవగాహన కల్పించాలని, దళిత బహుజన ప్రజల అభివృద్ధి కోసం,విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టాడని కొనియాడారు. నవంబర్ 15న ఢిల్లీలో జరిగే బహుజన సాహిత్య అకాడమీ 20వ జాతీయ సదస్సు సందర్భంగా శ్రీనివాస్ కు ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.కాగా తనకు అవార్డు రావడంతో హర్షం వ్యక్తం చేస్తూ,అంబేద్కర్ భావజాలాన్ని మరింత వ్యాప్తి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు. తనకు అవార్డు రావడం కోసం సహకరించిన బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర కమిటీ సభ్యులు ముక్కెర సంపత్ కుమార్ కు,జాతీయ కార్యాలయ కార్యదర్శి హెచ్. విష్ణు కు,రాష్ట్ర కార్యదర్శి కనుకుంట్ల విజయకుమార్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## చిగురుమామిడి బిఆర్ఎస్ గ్రామ శాఖ కన్వీనర్‌గా

# కాశబోయిన రాజు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నిక



**చిగురుమామిడి సెప్టెంబర్ 27(జనంసాక్షి):** హుస్నాబాద్ నియోజకవర్గ మాజీఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం చిగురుమామిడి గ్రామ శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు.ఈ సమావేశానికి జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి హాజరై పార్టీ బలోపేతం,భవిష్యత్తు కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.చిగురుమామిడి గ్రామ శాఖ నూతన కన్వీనర్‌గా కాశబోయిన రాజు యాదవ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి,మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య అధికారికంగా ప్రకటించారు.ఈ సందర్భంగా నూతన కన్వీనర్‌ను పార్టీ నాయకులు,కార్యకర్తలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ కు,పార్టీ మండల నాయకత్వానికి రాజు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యువన్యాయవాది,మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు,వార్డు మెంబర్లు పెనుకుల శ్రీనివాస్,నాగెల్లి హరీష్,మాజీ రైతుబంధు సభ్యులు పెనుకుల తిరుపతి, మాజీ సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్,మైనార్టీ సెల్ అధ్యక్షులు సర్వర్ పాషా,పార్టీ ప్రముఖులు చెరుకు సంజీవ్,బురుగు శ్రీకాంత్,బండారుపల్లి చంద్రం,పోటు సుధీర్, పోగాకుల శ్రీకాంత్,తాళ్లపల్లి అరవింద్,పెనుకుల శ్రీనివాస్,గొర్రె శ్రీధర్, పెనుగుల సూర్య కిరణ్, గుడుగుల ఆంజనేయులు, సూర్య ప్రకాష్,సురేష్ తదితర బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు,ముఖ్య కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేతన్న, రైతన్న, విద్యార్థి, అన్ని వర్గాల సమస్యలకు సమాధానం చెప్పాలి

## సిరిసిల్ల పర్యటనలో హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలి: కల్వకుంట్ల గోపాల్‌రావు

**ముస్తాబాద్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సిరిసిల్ల పర్యటన సందర్భంగా ప్రజా సమస్యలపై స్పష్టత ఇవ్వాలని మాజీ రైతుబంధు మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి పనులు, బకాయిలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు.భూముల ఆరోపణలపై శ్వేతపత్రం ఇవ్వాలి:సిరిసిల్ల జిల్లాలో 8 వేల ఎకరాల ప్రభుత్వ భూములపై ఆరోపణలు చేస్తున్న ప్రభుత్వం వాటి పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని గోపాల్‌రావు అన్నారు. 2,400 ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్న నేపథ్యంలో ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబర్‌లో ఎంత భూమి ఉందో వెల్లడించాలని డిమాండ్ చేశారు.నేతన్నల సమస్యలు పరిష్కరించాలి:బతుకమ్మ చీరల పథకం, ప్రభుత్వ వస్త్ర ఆర్డర్లు నిలిచిపోవడంతో సిరిసిల్ల నేత కార్మికులకు ఉపాధి తగ్గిందని గోపాల్‌రావు ఆరోపించారు. రూ.60 కోట్ల పెండింగ్ బకాయిలను చెల్లించాలని, 10 శాతం యార్న్ సబ్సిడీని పునరుద్ధరించాలని కోరారు. సిరిసిల్లలో యార్న్ డిపో ఏర్పాటు చేయడంతో పాటు రూ.5 లక్షల నేతన్న బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వీవింగ్ పార్క్, అపరెల్ పార్క్‌లలో పరిశ్రమలను ప్రారంభించి ఉపాధి కల్పించాలని కోరారు.రైతు, విద్యార్థి సమస్యలపై స్పష్టత ఇవ్వాలి:రైతుబంధు బకాయిలు, రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబీమా, కౌలు రైతులకు ఇచ్చిన హామీలపై సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలని అన్నారు. మల్కపేట నుంచి అప్పర్ మానేరు వరకు సాగునీటి తరలింపు, చెరువులు, చెక్‌డ్యామ్‌ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల



నిర్మాణానికి నిధులు విడుదల చేయడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.సంక్షేమ హామీలను అమలు చేయాలి:ఆసరా పెన్షన్లు, మహాలక్ష్మి, కళ్యాణలక్ష్మి, దళితబంధు, బీసీబంధు, గొర్రెలు, చేపపిల్లల పంపిణీ తదితర పథకాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని గోపాల్‌రావు కోరారు. ఆటో డ్రైవర్లు, ముదిరాజ్‌లు, నేతన్నలు తదితర వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. సిరిసిల్ల అభివృద్ధి, వైద్యం, విద్య, పరిశ్రమలు, రహదారులు, విద్యుత్ తదితర అంశాలపై సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

# చెట్టు మీద నుంచి జారిపడి వ్యక్తి మృతి

**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి), సెప్టెంబర్ 27:** పోతన కాలనీలో శనివారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. కాలనీలోని 77వ బ్లాక్‌కు చెందిన వేముల రాజేందర్ (57) ప్రమాదవశాత్తు చెట్టు మీద నుంచి జారిపడి మృతి చెందారు. రాజేందర్ సింగరేణి సంస్థలో ఒంఖగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది.



చెట్టు ఎక్కిన సమయంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడటంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో రాజేందర్ మృతి చెందారు.మృతుడు రాజేందర్‌కు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రాజేందర్ మృతితో పోతన కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు, స్నేహితులు, పరిచయస్తులు తీవ్రగ్ర్భాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అపూర్వ ఎన్‌క్లేవ్‌లో డ్రైనేజీ సమస్యల పరిశీలన

**కరీంనగర్ కల్చరల్,సెప్టెంబర్ 27 (జనం సాక్షి)** కరీంనగర్:11వ డివిజన్ పరిధిలోని అపూర్వ ఎన్‌క్లేవ్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను 11వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి ఆకుల నర్మద నర్సన్న గారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కాలనీవాసుల నుంచి అందిన సమాచారం మేరకు కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ డ్రైనేజీ వ్యవస్థ,మురుగునీటి ప్రవాహం,ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని తెలిపారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం తన ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.11వ డివిజన్‌లో డ్రైనేజీ, రోడ్లు,తాగునీరు,వీధి దీపాలకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 11వ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సన్న గారు హామీ ఇచ్చారు.





# ఆంజనేయ స్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

**మల్యాల సెప్టెంబర్ 27 (జనంసాక్షి)** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టు ఆంజనేయస్వామిని ఆదివారం హైకోర్టు జడ్జి వేణుగోపాల్,జిల్లా కోర్టు జడ్జి రత్న పద్మావతి, సెషన్ కోర్టు న్యాయమూర్తి డి.నాగేశ్వర్ రావు దర్శించుకున్నారు.స్వామివారి దర్శనానికి వచ్చిన హైకోర్టు జడ్జ్ వేణుగోపాల్ కు ఆలయ అర్చకులు ఈవో అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు.ఈవో హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాలను శాలువాతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ ఈవో అంజనారెడ్డి,ఎస్సై సందీప్,వేద పండితులు, అర్చకులు,ఆలయ,అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# అంతగిరిలో వీరనారి ఐలమ్మకు ఘన నివాళి

## విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఇల్లంతకుంట మండలం అంతగిరి గ్రామంలో ఆదివారం మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమని, ఆమె స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన బాటలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మామిడి రాజు, టెంపుల్ చైర్మన్ కోలపురి అనంతగిరి, అంతగిరి వినయ్‌కుమార్, తీగల భాగ్యలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.



# ఇప్పెనపెల్లీ సాంబయ్యకు కొండా లక్ష్మణ్ బాపూజీ జాతీయ ఎక్సలెన్స్ అవార్డు

**చొప్పదండి, సెప్టెంబర్ 27( జనం సాక్షి):** హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకల్లో, అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చొప్పదండి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఇప్పెనపెల్లీ సాంబయ్యకు కొండ లక్ష్మణ్ బాపూజీ జాతీయ ఎక్సలెన్స్ అవార్డు అందజేశారు.ప్రజా సేవ, రైతు సంక్షేమం, చేనేత కార్మికుల అభ్యున్నతి, గ్రామీణాభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమానికి చేసిన సేవలకు గుర్తింపుగా ప్రధానం చేసే ఈ అవార్డును ఇఫ్త్ర. హనుమంతరావు చేతుల మీదుగా సంఘం అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సూరేపల్లి రవికుమార్ సమక్షంలో అందుకున్నారు .ఈ సందర్భంగా సాంబయ్య సంఘానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజా సంక్షేమం కోసం తన సేవలను కొనసాగిస్తానని తెలిపారు. జాతీయ ఎక్సలెన్సీ అవార్డును సాంబయ్య అందుకోవడం పట్ల మండలంలోన పలువురు హర్షం వ్యక్తం చేశారు.



## రాష్ట్ర స్థాయిలో అదరగొట్టిన నల్లవెల్లి ఆనంది

# రెండు గోల్డ్ మెడల్స్..

## జాతీయ పోటీలకు ఎంపిక

**కమాన్‌పూర్, సెప్టెంబర్ 27, (జనంసాక్షి )** హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 12వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ జూనియర్స్ చాంపియన్‌షిప్‌లో కమాన్‌పూర్‌కు చెందిన నల్లవెల్లి ఆనంది సత్తాచాటింది. అండర్?18 విభాగంలో 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ప్రతిభ కనబరిచి రెండు గోల్డ్ మెడల్స్ సాధించింది.రాష్ట్ర స్థాయి పోటీల్లో అద్భుత ప్రదర్శనతో పతకాలు సాధించిన ఆనంది, తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో అక్టోబర్ 23 నుంచి 27 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. రాష్ట్ర స్థాయి వేదికపై ప్రతిభ చాటి జాతీయ పోటీలకు అర్హత సాధించడం పట్ల క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు. ఆనంది సాధించిన విజయంపై రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్ సుబ్బారావు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఉద్యోగ సేవా రంగంలో జాతీయ స్థాయి పురస్కారం.

**జమ్మికుంట,సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** అఖిలభారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ సి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు,ప్రస్తుతం జమ్మికుంట పోస్టుమాస్టర్ గా విధులు నిర్వహిస్తున్న హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలానికి చెందిన ఊకంటి మహేందర్ కు ఉద్యోగ సేవా రంగంలో విశిష్టమైన సేవలు అందిస్తూ ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నందుకు




గాను జాతీయ స్థాయి పురస్కారం 2026 లభించడం అభినందనీయమని తపాలా ఉద్యోగుల సంఘం తెలంగాణ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఉద్యోగుల హక్కులు, సంక్షేమం, సేవా ప్రయోజనాల పరిరక్షణతో పాటు తపాలా శాఖ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఈ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉద్యోగ సేవా రంగంలో అంకితభావంతో పనిచేస్తూ, సహచర ఉద్యోగులకు మార్గదర్శకంగా నిలుస్తున్న ఆయన సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు.శ్రీ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం తెలుగు వెలుగు సాహితీ వేదిక 2026 సందర్భంగా 27- 9 -2026 ఆదివారం రోజున వరంగల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా తపాలా ఉద్యోగుల సంఘం తెలంగాణ ప్రతినిధులు, సహచర ఉద్యోగులు, శ్రేయోభిలాషులు యు. మహేందర్ కి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో కూడా ఉద్యోగుల సంక్షేమం,తపాలా సేవల అభివృద్ధికి మరింతగా సేవలందించాలని ఆకాంక్షించారు. అలాగే"ఉద్యోగ సేవలో అంకితభావం ?సమాజ సేవలో స్ఫూర్తి" అనే నినాదంతో ఆయన ఈ జాతీయ పురస్కారం అందుకోవడం మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని వారు తెలిపారు.

# చారిత్రక సంపద రక్షణలో అధికారుల అసందర్భ వైఖరి

## ఒక చోట కేసులు, మరోచోట మౌనం

**నిజామాబాదు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 జనంసాక్షి:**
చారిత్రక సంపద పరిరక్షణలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు, చట్టాల అమలులో కనిపిస్తున్న ద్వంద్వ ప్రమాణాలు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.రఘునాథాలయం స్వాగత తోరణానికి రంగులు వేసిన సంఘటనపై పోలీసులు వెంటనే స్పందించారు. పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ద్వారా ఫిర్యాదు స్వీకరించి, నిబంధనలు అతిక్రమించారనే ఆరోపణలపై గతంలో ఏకంగా ఎనిమిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగింది.

అయితే, ఇదే కోణంలో ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న పరిణామాలు మరియు అధికారుల మౌనం పలు సందేహాలకు, విమర్శలకు తావిస్తోంది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే రైల్వే శాఖ నిబంధనలు అత్యంత కఠినమైనవిగా ఉంటాయని అందరికీ తెలిసిందే. కానీ, నిజామాబాదు రైల్వే స్టేషన్ స్వాగత తోరణం పక్కనే మరో మతపరమైన ప్రతీకగా భావించే '786' సంఖ్యను స్పష్టంగా రాసినప్పటికీ, అక్కడ రైల్వే అధికారులు గాని, స్థానిక పోలీసులు గాని కనీసం స్పందించకపోవడం గమనార్హం.ఒకవైపు నిబంధనల పేరుతో కొందరిపై హడావుడిగా కేసులు నమోదు చేయడం, మరోవైపు అదే స్థాయిలో బహిరంగంగా కనిపించే ఉల్లంఘనలను పట్టించుకోక పోవడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తనీ అవుతోంది. ఈ రెండు ఘటనలను బేరీజు వేసి చూస్తే, చట్టాల అమలులో ఒకే రకమైన పద్ధతి పాటించట్లేదనే అభిప్రాయం బలపడుతోంది. చారిత్రక కట్టడాలైనా, ప్రభుత్వ లేదా రైల్వే ఆస్తులైనా ఎవరి ప్రమేయంతో వాటికి రంగులు వేసినా, అనధికారిక రాతలు రాసినా చట్టపరంగా ఒకే రకమైన చర్యలు ఉండాలి.కానీ, స్థానిక పరిస్థితులు లేదా ఇతర ఒత్తిళ్ల కారణంగా అధికారులు ప్రదర్శిస్తున్న ఈ వివక్షపూరిత వైఖరి చట్టంపై ప్రజలకు ఉండే నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. కాబట్టి, సంబంధిత అధికారులు ఇలాంటి విషయాల్లో ఎలాంటి పక్షపాతం లేకుండా నిబంధనలను సమానంగా అమలు చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.ఒకవైపు చారిత్రక వైభవాన్ని కాపాడుతూనే, మరోవైపు ప్రభుత్వ, రైల్వే



ఆస్తులపై జరిగే అనధికారిక రాతలు, అక్రమ నినాదాల పట్ల కూడా కఠిన చర్యలు తీసుకున్నప్పుడే చట్టం ముందు అందరూ సమానులనే భావన ప్రజల్లో బలపడుతుంది. ఈ అంశంపై ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించి, చట్టాల అమలులో పారదర్శకతను పాటించేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు

## అక్టోబర్ 9న పోలింగ్

### బస్సు డిపోల్లో రగులుతున్న కార్మిక పోరు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 జనం సాక్షి:**
టీఎస్ఆర్టీసీ లో మరోసారి ఎన్నికల వేడి తారా స్థాయికి చేరింది. కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా, కార్మిక లోకానికి పెద్ద దిక్కుగా నిలిచే "గుర్తింపు సంఘం" కోసం మహా సంగ్రామానికి రంగం సిద్ధమైంది. కేవలం మాటల యుద్ధం




కాకుండా, అత్యంత పకడ్బందీగా సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఈ ఎన్నికలను నిర్వహించడానికి నిజామాబాదు జిల్లా వ్యాప్తంగా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.ఎన్నికల రిటర్నింగ్ అధికారి మరియు జాయింట్ లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో బరిలో నిలిచిన 12 కార్మిక సంఘాలకు గుర్తులను అధికారికంగా కేటాయించగా, అక్టోబర్ 9న జరగనున్న పోలింగ్ కోసం కార్మిక సంఘాలు సర్వసన్నద్ధనీ అవుతున్నాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి సంఘం తూచా తప్పకుండా పాటించాలని అధికారులు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఈ ప్రతిష్టాత్మక ఎన్నికల్లో బరిలో నిలిచిన సంఘాలు మరియు వాటికి కేటాయించిన గుర్తుల వివరాలు ఇలా ఉన్నాయి. ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) కి బస్సు గుర్తు, తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) కు నిచ్చెన గుర్తు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్.డబ్ల్యూ.ఎఫ్) కి నక్షత్రం గుర్తు, నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) కి దివిటీ పట్టుకున్న చేయి గుర్తు కేటాయించబడ్డాయి. అలాగే కార్మిక సంఘానికి పులి, కార్మిక పరిషత్ కు బస్సు టైరు, బహుజన వర్కర్స్ యూనియన్ కి కత్తెర, తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ కు విల్లు-బాణం, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కి త్రాసు, సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్ కు బతుకమ్మ, బహుజన కార్మిక యూనియన్ కి ధర్మ చక్రం, మరియు తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ కు గద గుర్తును కేటాయించారు.ఈ ఎన్నికల్లో ఏకంగా 12 సంఘాలు పోటీ పడుతుండటంతో పోటీ రసవత్తరంగా మారింది. కార్మికుల మన్నలను పొందడానికి ప్రతి యూనియన్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అక్టోబర్ 9న జరిగే పోలింగ్‌లో కార్మికులు ఏ గుర్తింపు సంఘానికి పట్టం కడతారనే ఉత్కంఠ ఇప్పుడు ఆర్టీసీ సర్వత్రా నెలకొంది.

# గ్రామాల్లో కాంగ్రెస్ యూత్ కమిటీలు ఏర్పాటు

**భిక్కనూరు సెప్టెంబరు 27 (జనం సాక్షి):**
భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామంలో కాంగ్రెస్ యూత్ కమిటీని ఏర్పాటు చేశారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జీవన్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్థాయిలో నూతన యూత్ కమిటీలను ప్రకటించారు. జంగంపల్లి యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షునిగా కొండం రవి, ఉపాధ్యక్షుడు సోహెల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పుల్లూరి చందును నియమించారు, నూతనంగా నియమితులైన పార్టీ నాయకులకు పార్టీ కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండల యూత్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ యువతకు కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యత కల్పిస్తున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీ వైపు మరింతగా ఆకర్షితులై పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యూత్ కాంగ్రెస్ కమిటీలు కీలకంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు సత్యం, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, ఉపసర్పంచ్ ప్రకాష్ గౌడ్, మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్, మాజీ ఎంపిటిసి రామస్వామి, ఆలయ కమిటీ డైరెక్టర్ కార్తీక్, పార్టీ కార్యకర్తలు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు:కొమ్మెట రాజు

**ముస్తాబాద్ సెప్టెంబర్ 27 (జనం సాక్షి)**
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు కొమ్మట రాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ. రామస్వామి అధికార పార్టీ అండదండలు చూసుకొని దళితులకు ఇందిరమ్మ



ఇళ్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాకుండా చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. బాబాసాహెబ్ కల్పించిన రాజ్యాంగ హక్కుల ద్వారానే రామస్వామి ప్రజాప్రతినిధిగా గెలిచారని, ఇప్పుడు అదే మహనీయుడిని, రాజ్యాంగాన్ని అవమానించేలా మాట్లాడటం యావత్ సమాజాన్ని కించపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామస్వామిపై చట్టపరమైన చర్యలు తీసుకొని 24 గంటల్లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు తక్షణమే స్పందించకపోతే ఈ నెల 30న సిరిసిల్లాకు రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభను దళిత సంఘాల ఆధ్వర్యంలో అడ్డుకుంటామని నాయకులు హెచ్చరించారు.



# ఘనంగా కూతుళ్ల దినోత్సవ వేడుకలు

## సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారుల సందడి

**కామారెడ్డి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):**
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణ పరివార్ కాలనీలో కూతుళ్ల దినోత్సవ వేడుకలను తల్లిదండ్రులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి దినోత్సవ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.కూతుళ్ల ప్రాధాన్యతను చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాటల పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించగా చిన్నారులు తమ ప్రతిభతో అలరించారు. పిల్లల ఆటపాటలతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది.తల్లిదండ్రులు మాట్లాడుతూ కూతుళ్లు కుటుంబానికి ఆనందాన్ని, సమాజానికి వెలుగును అందించే ఆణిముత్యాలని పేర్కొన్నారు. కూతుళ్లను సమానంగా ప్రోత్సహించి వారి ప్రతిభను వెలికితీయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

# ప్రజల దృష్టి మరల్చేందుకే సీఎం రేవంత్ సిరిసిల్ల పర్యటన: రసమయి బాలకిషన్

**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):**
సిరిసిల్ల ప్రాంత అభివృద్ధిపై చర్చించకుండా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుపై విమర్శలు చేసేందుకే సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటనకు వస్తున్నారని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. ఆదివారం ఇల్లంతకుంటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కేటీఆర్ హయాంలో సిరిసిల్లలో పవర్‌లూమ్ రంగానికి ప్రోత్సాహం లభించిందని, మధ్యమానేరు ప్రాజెక్టుతో ఈ ప్రాంతానికి సాగునీటి వసతులు మెరుగుపడ్డాయని రసమయి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నలు, రైతుల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు.

ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాల్లోని చెరువులకు సాగునీరు అందించేందుకు అన్నపూర్ణ రిజర్వాయర్, మధ్యమానేరు కుడికాల్వ, డీ4 కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పంట



కాల్వల మరమ్మతులు చేపట్టాలని కోరారు.స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియోజకవర్గ అభివృద్ధికి తగిన నిధులు తీసుకురావడం లేదని రసమయి ఆరోపించారు. ఇల్లంతకుంట 50 పడకల ఆస్పత్రి, రహదారుల నిర్మాణం, మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని, సిరిసిల్లలో సభ నిర్వహించడమే కాకుండా నియోజకవర్గానికి అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని రసమయి బాలకిషన్ కోరారు.ఈ సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్ సిద్ధంవేను, మండల ప్రెసిడెంట్ పల్లె నరసింహారెడ్డి,సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు రాజిరెడ్డి, గాలిపల్లి సర్పంచ్ శేఖర్ రెడ్డి , బొల్లం వెంకటేశం, గొడుగు తిరుపతి,రడం ప్రవీణ్, ర్యాగటి రమేష్, పట్నం శ్రీనివాస్, కూనబోయిన రఘు, తిరుపతి మొదలగు వారు పాల్గొన్నారు.

# సంఘ అభివృద్ధికి రైతులందరూ సహకరించాలి

## రుణాలను సకాలంలో చెల్లించాలి: మల్లూరు సొసైటీ చైర్మన్ కళ్యాణి విఠల్‌రెడ్డి

**నిజాంసాగర్, సెప్టెంబర్ 27 జనంసాక్షి :**
సహకార సంఘం ద్వారా రైతులు పొందిన రుణాలను నిర్ణీత గడువులోగా సకాలంలో చెల్లించి, సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మల్లూరు సహకార సంఘం చైర్మన్ కళ్యాణి విఠల్‌రెడ్డి కోరారు. ఆదివారం మల్లూరు సొసైటీ ఆవరణలో నిర్వహించిన మహాజన సభలో ఆమె మాట్లాడారు.



సభ ప్రారంభంలో సొసైటీ సీఈఓ సాయిలు సంఘానికి సంబంధించిన జమా ఖర్చులు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వ్యయ వివరాలను సభ్యులు, రైతులకు వివరించారు. అనంతరం చైర్మన్ కళ్యాణి విఠల్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీ ప్రస్తుతం సుమారు రూ. 23.50 లక్షల ఆదాయంతో కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వం నుంచి వరి కొనుగోలు కమిషన్‌కు సంబంధించి మరో రూ. 33 లక్షలు రావాల్సి ఉందని పేర్కొన్నారు.రైతులు సొసైటీ ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినప్పుడే సంఘం ఆర్థికంగా మరింత బలోపేతమవుతుందని అన్నారు. రైతులు రుణాల చెల్లింపులో బాధ్యతగా వ్యవహరించి సొసైటీ పురోగతికి తోడ్పడాలని కోరారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి**

వానాకాలం పంటల కొనుగోళ్ల అనంతరం ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని మహాజన సభలో రైతులు కోరారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు రహదారులపై మొరం పనులు చేపట్టాలని, రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న చెట్లు, కొమ్మలను తొలగించాలని తీర్మానించారు.
అదేవిధంగా యూరియా విక్రయాల సమయంలో హమాలీ చార్జీల భారాన్ని రైతులపై మోపకుండా సొసైటీనే భరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. యాప్ సమస్యల కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా, వారికి నేరుగా యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని సభలో తీర్మానాలు చేశారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రజా పండారి, మాజీ వైస్ ఎంపీపీ మనోహర్, సర్పంచ్ అడ్డగళ్ల శారద భూమేష్, మాజీ సర్పంచ్ బాబు, సొసైటీ వైస్ చైర్మన్ రామ్‌సింగ్, సొసైటీ సభ్యులు, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మకు అక్షరాభ్యాసం నిరక్షరాస్యత రూపుమాపేలా "ఉల్లాస్"

**చదువు రాని పెద్దలకు చదువు చెబుతాం!**

**అమ్మలకు "పరీక్ష" వేలిముద్రలు కాదు - ఇకపై మేము సంతకాలు చేస్తాం!**

**భిక్కనూరు సెప్టెంబర్ 27 (జనం సాక్షి):**
రాష్ట్రంలో వయోజన విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉల్లాస్ కార్యక్రమం, ఇప్పటివరకు వారంతా నిరక్షరాస్యులుగా వేలిముద్ర వేసేవారిగా ముద్రపడ్డారు. కనీసం తెలుగు అక్షరాలను గుర్తించలేరు,చదవలేరు రాయలేరు, అలాంటి వారిని భిక్కనూరు మండలంలోని వివిధ గ్రామాలలో 780 మంది క్లస్టర్ పరిధిలో ఉల్లాస పరీక్షలు నిర్వహించారు,ఆదివారం ఉదయం ఎం.పీ.పీ.ఎస్ కొత్తపేట స్కూల్ మరియు బాయ్స్ హై స్కూల్ భిక్కనూరులో పరీక్షకు క్లస్టర్ పరిధిలోని సభ్యులు 42 మంది హాజరై 100% హాజరు నమోదు చేయడం విశేషంగా నిలిచింది,పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు,ఈకార్యక్రమానికి క్లస్టర్ పరిధిలోని గ్రామ సంఘాల అధ్యక్షురాలు బత్తుల గంగ లక్ష్మి, బత్తుల జయరాణి, సీ.సీ గంగల జయశ్రీ, ఏపిఎం సాయిలు,వివోఏలు, భిక్కనూరు వార్డు సభ్యులు గజ్జె వేణు,పడిపల్లి సిద్ధారెడ్డి, తదితరులు హాజరై ఈపరీక్ష నిర్వాణతీరును పరిశీలించి, సభ్యుల హాజరైన వివరాలు తెలుసుకున్నారు,"ఉల్లాస" పరీక్షకు సభ్యులు హాజరై 100% హాజరు నమోదు చేయడం పట్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.ఈసందర్భంగా ఏపీఎం సాయిలు మాట్లాడుతూ మహిళల్లో అక్షరాస్యతను పెంపొందించడం ద్వారా తమ దైనందిన జీవితంలో అనేక విషయాలను స్వయంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. మహిళలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని చదువు నేర్చుకోవాలని సూచించారు, ఈకార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వాకర్స్ అసోసియేషన్ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలి

## అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 జనంసాక్షి:** ఐ టీ ఐ వాకర్స్ అసోసియేషన్ రాష్ట్రంలోనే గుర్తింపు పొందాలని, ఆదర్శం గా నిలవాలనీ అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ అన్నారు.నగరంలోని న్యాల్ కల్ రోడ్డులో గల ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఏర్పాటుచేసిన ఐటిఐ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతనంగా ఏర్పాటైన కార్యవర్గం చే ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిఐ గ్రౌండ్ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.వాకింగ్ గ్రూప్ రాజకీయం వైపు పోకుండా ఐకమత్యం గా ఉంటూ సమాజ సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలన్నారు. బాడీ ఫిట్నెస్ ఉంటేనే జీవితంలో ఏదైనా సాధించవచ్చన్నారు. ఐటిఐ వాకర్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లాలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. వాకర్స్ అసోసియేషన్ సొంత డబ్బులతో సమాజసేవ




కార్యక్రమంలో పాల్గొన్నందుకు అభినందించారు. ఐటిఐ గ్రౌండ్ లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం నుడా చైర్మన్ కేశ వేణు మాట్లాడుతూ ఐటిఐ గ్రౌండ్ లో మౌలిక వసతుల కల్పనకు వచ్చేనెల నిధులనుండి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కూరగాయల ఉమారాణి, డిసిసి డెలిగేట్ భక్తవత్సలం నాయుడు,కార్పొరేటర్లు, జగదీష్ కులకర్ని, మురళి, శ్రవణ్, రమేష్ గుప్తా, శ్రీనివాస్ రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గొండల పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి మోహన్ గైక్వాడ్, కోశాధికారి సీతారాములు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న రేషన్ కార్డులు

## అర్హులైన నిరుపేద కుటుంబాలకు నూతన రేషన్ కార్డుల పంపిణీ

### ఏళ్ల తరబడి ఎదురుచూసిన కుటుంబాలకు ఊరట

**నిజాంసాగర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):**
పేద కుటుంబాలకు రేషన్ కార్డు ఒక వజ్రాయుధం లాంటిదని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఇది ఎంతో కీలకమని గ్రామ సర్పంచ్ లక్ష్మయ్య అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా అర్హులైన నిరుపేద కుటుంబాలకు నూతన రేషన్ కార్డులను మంజూరు చేయగా, గ్రామ సర్పంచ్ లక్ష్మయ్య చేతుల మీదుగా లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు.
ఎన్నో సంవత్సరాలుగా రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడంతో వారి కుటుంబాల్లో ఆనందం నెలకొంది. ముఖ్యంగా పెళ్లయి పది సంవత్సరాలు దాటినా రేషన్ కార్డు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు కార్డులు అందడం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. రేషన్ కార్డు ద్వారా పేద కుటుంబాలకు అవసరమైన ఆహార ధాన్యాలు అందడంతో పాటు ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ కార్యక్రమాల్లో అర్హత పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ప్రజా పాలనలో అర్హతే ప్రామాణికంగా, నిజమైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని నాయకులు తెలిపారు. నూతన రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాసనపల్లి రవీందర్, జీపీ ఓ సంగమేశ్వర్ రెడ్డి, వార్డు సభ్యులు సంతోష్, రాజు, అంజమ్మ, గ్రామ నాయకులు బొడ్డు అంజయ్య, సాయిలు, ప్రసాద్, గఫూర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**కమ్మర్పల్లి సెప్టెంబర్ 27(జనంసాక్షి)**
మండలంలోని ఉప్లూర్ గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను గ్రామ సర్పంచ్ ఎనుగందుల శైలేందర్ లబ్ధిదారులకు ఆదివారం రోజున అందజేశారు. గ్రామానికి చెందిన ఆసియా భాను 30 వేలు,రెంజర్ల భారతి 60 వేలు, నారబోయిన గంగు 30 వేలు,తక్కురి లక్ష్మి, 1లక్ష 16 వేల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ కష్టకాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం ఇప్పించుటలో కృషి చేసిన




బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్,తెలంగాణ రాష్ట్ర పంచాయతీ ట్రిబ్యునల్ మెంబర్ బాస వేణు గోపాల్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తక్కురి శేఖర్,వార్డ్ నెంబర్ విభూది అనిల్,న్యాయ వాది ప్రభుత్వ ఏజీపీ సరసం చిన్న రెడ్డి, డిసిసి కార్యదర్శి ఏలేటి మోహన్ రెడ్డి, జిల్లా నాయకులు తిప్పి రెడ్డి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోనగిరి భాస్కర్, ఉప్లూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు మరుపాక నరేష్, నాయకులు సాదుల,నజీర్, ఆంజనేయులు, ఉబెదు,క్రాంతి,అనిల్,సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను కించపరిస్తే సహించేది లేదు: శివప్రసాద్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 జనంసాక్షి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు, సిద్ధాంతాలకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎప్పుడూ కట్టుబడి ఉందని, ఆ సిద్ధాంతాల ఆచరణే బీజేపీ ఊపిరి అని నిజామాబాద్ జిల్లాకు చెందిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బీఆర్ శివప్రసాద్ స్పష్టం చేశారు. ఇటీవల అమరప్రసాద్ అనే వ్యక్తి రాజ్యాంగ పుస్తకాన్ని దహనం చేసిన ఘటనపై తీవ్రంగా స్పందించిన ఆయన, ఇది అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు.అంబేద్కర్ భావజాలం మరియు బీజేపీ వైఖరి బీజేపీ ఎల్లప్పుడూ అంబేద్కర్ సిద్ధాంతాలనే బలంగా నమ్ముతుందని, ఆ సిద్ధాంతాల ఆధారంగానే అనేక మంది కార్యకర్తలు పనిచేస్తున్నారని శివప్రసాద్ తెలిపారు. డాక్టర్ అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి లేదా కులానికి మాత్రమే పరిమితం కాదని, ఆయనో మహా వ్యక్తి అని, సమస్త హిందూ సమాజం కూడా ఆయనను అత్యున్నత గౌరవంతో చూస్తుందనే విషయాన్ని గుర్తుచేశారు. అంబేద్కర్ ఏనాడూ హిందూ ధర్మాన్ని వ్యతిరేకించలేదని, హిందూ సమాజంలోని అంటరానితనాన్ని మాత్రమే ఆయన తీవ్రంగా వ్యతిరేకించారని స్పష్టం చేశారు.రాజ్యాంగ అవమానాన్ని సహించేది లేదురాజ్యాంగ పుస్తకాన్ని కాళ్ల మీద రుద్దడం, దాన్ని అవమానించే చర్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని శివప్రసాద్ పేర్కొన్నారు. ముఖ్యంగా బండి ప్రసాద్ వంటి వ్యక్తికి ఈ సందర్భంగా హెచ్చరికలు జారీ చేస్తూ, పుస్తకం రాసినంత మాత్రాన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్థానాన్ని



తగ్గించలేరని, అలాంటి అపోహలు కేవలం వారి మూర్ఖత్వాన్ని మాత్రమే తెలియజేస్తాయని మండిపడ్డారు. భారత రాజ్యాంగాన్ని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కించపరిచే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సమాజంలో అందరినీ సమానంగా చూసే గొప్ప నాయకుడైన అంబేద్కర్ ఆశయాలను కాలరాసే ఏ ప్రయత్నాన్ని కూడా సహించేది లేదని ఆయన పునరుద్ఘాటించారు.

### గణేష్ విగ్రహ ప్రతిష్టాపన నుండి విమజ్జనం వరకు

## నిర్వాహణకు సహకరించిన ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు

### పోలీస్ కమిషనర్ వెల్లడి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 జనంసాక్షి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలో నిజామాబాద్,ఆర్మూర్ మరియు బోధన్ డివిజన్ పరిధి లలో గణేష్ విగ్రహ ప్రతిష్టాపన నుండి నిమజ్జనం వరకు పండుగ ఉత్సవాలు శాంతియుత వాతావరణం లో ప్రజలందరూ జరుపుకోవడం జరిగిందని, కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలో 5811 గణేష్ విగ్రహాలు ప్రతిష్టించడం జరిగింది.ప్రతిష్టాపన అనంతరం భక్తులందరూ సాంప్రదాయం ప్రకారం 9 మరియు 11 రోజుల పాటు మండపాలలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తదుపరి నిమజ్జనం చేయడం జరిగింది. దీనికి అన్ని మతాల ప్రజలు స్వచ్ఛందంగా సహకరించుకొని జయప్రదం చేయడం జరిగింది. నిమజ్జనం కోసం ప్రత్యేకంగా బాసర బ్రిడ్జి వద్ద కూడా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. బాసర , ఉమ్మెడ ఇవి కాకుండా మిగితా చాలా ప్రదేశాలలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పటిష్టంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి వేడుకలు ప్రశాంత వాతావరణంలో గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన మరియు నిమజ్జనం వేడుకలు అన్నింటికి సార్వజనిక గణేష్ మండలి , విగ్రహ గణేష్ కమిటీలు , మజీద్ కమిటీలు, మరియు అన్నిమతాల ప్రజలు , ప్రతీ ఒక్కరు పోలీస్ శాఖకు సహకరించడం జరిగింది. అదే విధంగా వివిధ శాఖల అధికారులు / సిబ్బంది ప్రత్యేకంగా రెవెన్యూ శాఖ, గ్రామ పంచాయతి మున్సిపాలిటి , అబ్కారీ శాఖ, ఫైర్ సర్వీస్ మరియు ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్, గజ ఈతగాళ్లు అందరూ వారి సేవలను అందించడం జరిగింది. మరియు పత్రిక ప్రతినిధులు ఎలక్ట్రానిక్ మీడియా / ప్రింట్ మీడియా సిబ్బంది అందరూ కూడా సహకరించడం జరిగింది. ఈ శుభ సందర్భంలో ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలుపుతున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ తెలిపారు.

## మహిళా సంఘాల సభ్యులకు పరీక్ష

### కిషన్‌నగర్‌లో 50 మంది మహిళలకు శిక్షణ, పరీక్ష

కిషన్‌నగర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి): బాల్కొండ మండలం కిషన్‌నగర్ గ్రామపంచాయతీలో మహిళా సంఘాల సభ్యులకు రుణ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ ఇచ్చి పరీక్ష నిర్వహించారు. మహిళా సంఘం సీసీ సుమ్మ ఆధ్వర్యంలో చదువు రాని సభ్యులకు ప్రాథమిక విద్య నేర్పించి, 50 మందికి పరీక్ష నిర్వహించారు.



కార్యక్రమంలో సర్పంచ్ రామ్‌రాజ్ గౌడ్, ఉపసర్పంచ్ స్వామి, మహిళా సంఘం అధ్యక్షురాలు గోసికొండ కళ్యాణి, గ్రూప్ సీఏ స్వప్న పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా సైకిల్ యాత్రలో సిరికొండ నాయకులు

### బోధన్ నుంచి జగిత్యాల వరకు సాగిన యాత్రలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

సిరికొండ సెప్టెంబర్ 27(జనం సాక్షి ): రైతుల సమస్యలు, రైతులకు ఇచ్చిన హామీల అమలును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే లక్ష్యంతో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం బోధన్ నుంచి ప్రారంభమైంది. బోధన్ నుంచి జగిత్యాల వరకు సాగే ఈ యాత్రలో సిరికొండ మండలానికి చెందిన బీజేపీ, కిసాన్ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఇందూర్ ఎంపీ ధర్మపురి అరవింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో యాత్ర కొనసాగింది.ఈ సందర్భంగా సిరికొండ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి తలకట్ల గంగారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, సరిపల్లి తండా



ఉపసర్పంచ్ పిట్ల కళ్యాణ్, కొండూరు బూత్ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు రంజిత్‌రెడ్డి, సాగర్‌రెడ్డి తదితరులు సైకిల్ యాత్రలో పాల్గొన్నారు.రైతులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యాత్ర ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు.

### గెలాక్సీ క్రికెట్ క్లబ్ ఓపెనింగ్ కు

### ముఖ్య అతిథి ఎస్సై శైలేందర్

బాల్కొండ న్యూస్ 27 సెప్టెంబర్ (జనం సాక్షి) నిజామాబాద్ జిల్లా బాల్కొండ శివారులోని గెలాక్సీ క్రికెట్ క్లబ్ గ్రాండ్ ఓపెనింగ్ కు ముఖ్య అతిథిగా బాల్కొండ ఎస్సై శైలేందర్ క్లబ్బు ఇనాగరేషన్ చేశారు .ఎస్సై శైలేందర్ మాట్లాడుతూ యువత చెడు బారున పడకుండా యువత పదార్థాలకు గంజాయి బారిన పడకుండా బాడీ ఫిట్నెస్ ఆరోగ్యంగా ఉండటానికి స్పోర్ట్స్ పై దృష్టి పెట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెడు వ్యసనలకు పోకూడదు అని బాల్కొండ ఎస్సై శైలేందర్ తెలిపారు.



## భిక్కనూరు మాల్గుడి రెస్టారెంట్ లో అధికారుల తనిఖీలు

### రుచి కోసం వెళ్లితే ఆరోగ్యానికి హానికరం

❍కొన్ని ఏళ్లుగా ప్రజల నమ్మకాన్ని పొందిన మాల్గుడి రెస్టారెంట్ పలు అనుమానాలు

❍అధికారుల తనిఖీలు నోటీసులతో సర్దిపెట్టొద్దు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలి ప్రజలు డిమాండ్

భిక్కనూరు సెప్టెంబర్ 27 (జనం సాక్షి): భిక్కనూరు మండల కేంద్రానికి అంతంపల్లి వద్ద జాతీయ రహదారిపై ఉన్న మాల్గుడి రెస్టారెంట్ హోటల్ ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన,పరిశుభ్రమైన ఆహారం అందిస్తుందని నమ్మకంతో కుటుంబాలతో కలిసి భోజనం చేసేందుకు కూడా ప్రజల అక్కడికి వెళుతుంటారు, ఆహారం తయారీ,నిల్వ, పరిశుభ్రత వంటి అంశాల్లో లోపాలు ఉన్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో గుర్తించినట్లు సమాచారం రావడంతో వినియోగదారులు ఆందోళన మొదలైంది,కొన్నేళ్లుగా ప్రజలు ప్రయాణికులు రెస్టారెంట్ హోటల్ పై ఉన్న నమ్మకం ఒక్కసారిగా ప్రశ్నార్థకంగా మారిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు,

**ప్రజల ప్రాణాలు అంటే అంతా నిర్లక్ష్యంతో వ్యాపారం**

నిబంధనలకు విరుద్ధంగా ఆహారం అందిస్తున్నట్లు నిర్ధారణ అయితే ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని కఠిన నిర్ణయం తీసుకోవాలని,తనిఖీల్లో గుర్తించిన లోపాలపై అధికారులు పూర్తిస్థాయిలో స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.



**రుచికరమైన ఆహారం పేరుతో ఆరోగ్యాన్ని పణంగా పెట్టొద్దు**

రుచికరమైన ఆహారాన్ని ప్రజలకు అందజేయడంలో వ్యాపారం పేరుతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడొద్దు అంటూ పలువురు ప్రజలు అధికారులను కోరుతున్నారు,ప్రజల నమ్మకాన్ని సంపాదించుకున్న మాల్గుడి రెస్టారెంట్ హోటల్ అదే నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కూడా యాజమాన్యంపై ఉంటాయని ఆహార విషయంలో నిర్లక్ష్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదు అని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. తనిఖీల్లో నమోదైన లోపాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బయటపెట్టి నిబంధన ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# గౌడ కులస్తులను ఇబ్బందులు పెడితే ఊరుకునేది లేదు

○తాళ్ళ రాంపూర్ విడిసి వ్యవస్త రద్దు చేసి బాదితులకు న్యాయం చేయాలి

○రెండవ సారి సాంఘిక బహిష్కరణ చేయడం అమానుషం




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 జనంసాక్షి:**
తాళ్ళ రాంపూర్ లో గౌడ , ఎస్సీ కులస్తులను సాంఘిక బహిష్కరణ చేయడం సరికాదని, విడిసిలా ఆగడాలు అరికట్టెల జిల్లా అధికారులు చొరవ చూపాలని గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా గౌడ్, కోశాధికారి లక్ష్మణ్ అన్నారు. ఆదివారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో గౌడ సంఘం అధ్వర్యంలో తాళ్ళ రాంపూర్ బాధితులకు మద్దతుగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళ రాజా గౌడ్ మాట్లాడుతూ.. ఎర్గట్ల మండలంలో తాళ్ళ రాంపూర్ గ్రామంలో విడిసి ఆగడాలు శృతి మించుతున్నా యన్నారు. 32 మంది గౌడ కులస్తులను కావలని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. 10 మంది మంది ఎస్సీ కులస్తులను కూడా బహిష్కరణ చేయడం చూస్తుంటే విడిసిలు ఎంతకు దిగజారారో అర్థమవుతుందన్నారు.
విడిసి లకు ఎలాంటి చట్టబద్ధత లేకున్నప్పటికీ, చట్టాన్ని చేతులకు తీసుకొని ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఇలాంటి వీడిసిలపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.
భవిష్యత్ లో ఇలాంటివి జరగకుండా రేపు అన్ని మండలాల్లో తహసీల్దార్ లకు వినతి పత్రాలు ఇస్తామని అన్నారు. అనంతరంగౌడ సంఘం కోశాధికారి లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ... గౌడ కులస్తులను రెండవ సారి బహిష్కరణ చేయడం సిగ్గు చేట అని, గౌడ కులస్తులతో ఎవరైనా మాట్లాడితే 25 వేలు జరిమానా విధించడం అనేది రాజ్యాంగాన్ని అతిక్రమంచడమే అన్నారు. గ్రామాభివృద్ధి కోసం మాత్రమే ఏర్పాటు చేసుకున్న విడిసి లు, చట్టానికి తీసుకోవడం సరికాదన్నారు. కొన్ని గ్రామాలలో అభివృద్ధి లక్ష్యంగా పనిచేసినప్పటికీ, తాళ్ల రాంపూర్ లాంటి విడిసి లతో అందరికీ చెడ్డ పేరు వస్తుందన్నారు. గ్రామాభివృద్ధి కమిటీలు ఎక్కడ లేవని, కేవలం నిజామాబాద్ జిల్లాలోనే ఉన్నాయన్నారు. వృత్తి మీద ఆధారపడుతున్న గౌడ కులస్తులను ఇబ్బందులకు కూడా చేస్తే చూస్తూ ఊరుకోమని, ఒకే గ్రామంలో రెండుసార్లు సాంఘిక బహిష్కరణ చేయడం అంటే ఇది మామూలు విషయం కాదన్నారు. గ్రామాల్లో గౌడ కులస్తులు అభివృద్ధి లో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ కొందరు కావాలని కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. గౌడ వ్యవస్త మీద విడిసి ఆగడాలు శృతి మించు తున్నాయన్నారు. గ్రామంలో చెప్పినట్లు వినకుంటే ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఇందల్ వాయి మండలం అద్యక్షులు శ్యామ్ సుందర్ గౌడ్, రూరల్ మండలం పరుశురాం గౌడ్, మోపాల్ మండలం నర్స గౌడ్, చంద్రం గౌడ్, రామ గౌడ్, రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యువత ఆరోగ్యమే మనకుగర్వకారణం




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 జనంసాక్షి:**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మరియు మేరా యువభారత్ సంయుక్త ఆధ్వర్యంలో నశాముక్త యువ సేవభారత్ 100 ఆదివారాల కార్యక్రమం లో భాగంగా ఆదివారం రెండవ వారం ఆరోగ్యమే నా గర్వకారణం అనే నినాదంతో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) భుజంగరావు హాజరయ్యారు. ముందుగా కార్యక్రమాన్ని ఉద్దేశించి మేరా యువభారత్ నశాముక్త భారత అభియాన్ పురస్కరించుకొని సంతకాల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ యువత వారి వ్యక్తిగత జీవితాన్ని మత్తు పదార్థాలకు బానిసలై కోల్పోతున్నారని ఏ సందర్భంలోనైనా ఎటువంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని అన్నారు. మత్తు పదార్థాలు లేని భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములమై కట్టుబడి ఉండాలని అంతేకాకుండా ప్రతి ఒక్కరి కుటుంబం స్నేహితులు బంధువులు పొరుగువారు మరియు అందరూ మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. వికసిత భారత్ కోసం నషాముక్త యువత అనే సంకల్పాన్ని నెరవేర్చడంలో ప్రతి ఒక్కరి సహకారాన్ని అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ జీవితంలో ఉత్తమ నైతిక విలువలను పాటిస్తూ మత్తు పదార్థాలు లేని జీవితాన్ని గడపాలని సమాజంలోని ప్రతి ఒక్కరికి అవగాహన కలిగిస్తూ చైతన్యవంతమైన సాధికారత కలిగిన మరియు నశాముక్త భారత దేశ నిర్మాణానికి నిరంతరం కృషి చేయాలని డ్రగ్స్ రహిత భారతదేశం కోసం పాటుపడాలన్నారు. ముఖ్యంగా ప్రొఫెషనల్ కాలేజీలు, ఇంజనీరింగ్ కళాశాలలో యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు ప్రతిరోజు వారిని గమనిస్తూ ఉండాలన్నారు. అదేవిధంగా అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో నషాముక్త యువ ఫర్ వికసితభారత్ సంకల్పబియాన్ పై విద్యార్థినీ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డిఎంహెచ్ఓ డాక్టర్ బి రాజశ్రీ మాట్లాడుతూ యువత కోసం 100 ఆదివారాలు ప్రత్యేకంగా పని చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఇక్కడికి వచ్చిన యువతకు అందరికీ సాధారణ ఆరోగ్య పరీక్షలు, బిఎంఐ లెక్కించడం, హైటు, వెయిట్, బిపి నిర్ధారణ పరీక్షలు, టీబీ ఎంబీఏ నిక్షయమిత్ర నమోదు, ఎక్స్రే పరీక్షలు, రక్త పరీక్షలు, నశాముక్తభారతపై మరియు మానసిక వ్యాధులపై అవగాహన కౌన్సిలింగ్, నిర్వ ఇంచామని నిర్వహించామని అన్నారు. అదేవిధంగా మానసిక వ్యాధులు ఉన్నవారు టోల్ ఫ్రీ నెంబర్ 14416కు కాల్ చేసి జిల్లా సైకియాట్రిస్ట్ ద్వారా సలహాలు సూచనలు చికిత్స పొందాలని తెలియజేశారు. ఈ సందర్భంగా మానసిక వ్యాధుల నిపుణులు డాక్టర్ విశాల్ మాట్లాడుతూ యువత భారతదేశానికి భవిష్యత్ తరాలకు గర్వకారణం అని ప్రపంచంలో ఏ దేశంలో లేనంత యువత భారతదేశంలో ఉన్నారని వీరి ద్వారానే భవిష్యత్తులో భారతదేశం అభివృద్ధి పదం వైపు నడుస్తుందన్నారు. పక్కన తీవ్రవాద దేశాల నుండి భారతదేశం లోకి యువతను మత్తుకు బానిస చేసేలాగా మత్తు పదార్థాలను గంజాయిని భారత దేశంలోకి రహస్యంగా చేరవేస్తున్నారని ప్రతి ఒక్క యువత అప్రమత్తంగా ఉండి మత్తు పదార్థాలకు గంజాయికి బానిస కాకుండా ఉండాలన్నారు. స్మోకింగ్ డ్రింకింగ్ మత్తు పదార్థాలు డ్రగ్స్ ఆల్కహాల్ లాంటి వ్యసనాలకు బానిసలైన ఎవ్వరైనా జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో నిర్వహించే డి అడిక్షన్ సెంటర్ కి రిఫర్ చేయాలని ఉచిత చికిత్స అందిస్తున్నామని దీన్ని అందరూ ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. మేరా యువభారత్ జిల్లాలో నిర్వహించే కార్యక్రమాలపై మేరా యువ భారత్ జిల్లా అధికారి రమేష్ తెలియజేశారు. నశాముక్త భారత అవగాహన కార్యక్రమం అనంతరం127 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా రక్త పరీక్షలు 69 మందికి, బిపి మరియు షుగర్ పరీక్షలు 98 మందికి, ఎక్స్రే పరీక్షలు 20 మంది విద్యార్థులకు, టీబీ ఎంబీఏ లో భాగంగా నిశ్చయిమిత్ర నమోదు 66 మంది విద్యార్థులు అయ్యారు. విద్యార్థులందరికీ నశముక్త భారత్ పై మరియు మానసిక వ్యాధుల పై అవగాహన కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో జిజి హెచ్ సూపరెంటెంట్ డాక్టర్ రాములు , ఐఎంఏ అధ్యక్షులు సైకియాట్రిక్ హెచ్ ఓ డి డాక్టర్ విశాల్, మేరా యువభారత్ జిల్లాఅధికారి రమేష్, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకన్న, డిటిసి ఓ డాక్టర్ దేవి నాగేశ్వరి,, ఆర్ బి ఎస్ కే కోఆర్డినేటర్ డాక్టర్ నవ్య, ఎయిడ్స్ అండ్ లెప్రసీ మెడికల్ అధికారి డాక్టర్ భార్గవి, డిప్యూటీ డెమో దుర్గారావు, డిహెచ్ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, డిపిఓ విశాల ఎస్సీ గర్ల్స్ హాస్టల్ విద్యార్థినిలు, ఎస్సీ,బీసీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులు, వివిధ స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## ఇందూరు బైపాస్ రోడ్డు లో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అస్మిత రోడ్ సైక్లింగ్ ప్రారంభోత్సవం

## పాల్గొన్న నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 జనంసాక్షి:**
ఇందూరు బైపాస్ రోడ్డు లో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అస్మిత రోడ్ సైక్లింగ్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి పాల్గొని జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఖేలో ఇండియా సైక్లింగ్ పోటీలకు దరఖాస్తు చేసుకున్న వారిలో నిజామాబాద్ నుండి అత్యధికంగా రిజిస్ట్రేషన్లు కావడం, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యునిగా తనకు అమితానందాన్నిచ్చిందనీ,యువత చెడు మార్గం వైపు పయనించకుండా సన్మార్గం వైపు పయనించాలని, మత్తు పదార్థాలకు బానిసలు అయితే జీవితం చిన్న భిన్నం అవుతుందని ఆయన తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలలో యువత చురుకుగా పాల్గొని తుమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ, మేయర్ ఉమారాణి, రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మల్లారెడ్డి, విజయ కాంత్ రావు, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కృపాకర్ రెడ్డి , జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఈగ సంజీవరెడ్డి, బొబ్బిలి నర్సయ్య , సీనియర్ న్యాయవాది రాజేందర్ రెడ్డి , నాఖీ విద్యాసంస్థల ఆఉఓ గోవర్ధన్ రెడ్డి, నగర కార్పొరేటర్లు, 33 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసిన జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి వామపక్షాల డిమాండ్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 జనంసాక్షి:**
ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సిపిఎంఎల్ మాస్ లైన్, ఆర్ ఎస్ పి, ఎం సి పి ఐ ల సమావేశం జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశం ను ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ సర్ పేరుతో ఓట్లను తొలగించడంపై ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ప్రజల విశ్వాసాన్ని ఘోరంగా దెబ్బతీశారని ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఓటర్ లిస్ట్ లో ఉన్న ఓటర్లలో చనిపోయిన ఒకటి కన్న ఎక్కువ ఉన్న ఓట్లను తొలగించడానికి వామపక్ష పార్టీలు స్వాగతిస్తున్నాయని తెలిపారు. గతంలో ఈడి,సిబిఐ పేరుతో ప్రతిపక్షాలపై దాడులు చేసిన సంఘటనలు చూసామని కానీ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరుతో ఎన్నికలు జరగబోతున్న రాష్ట్రాల్లో ఎన్నికల కమిషన్ ముందు పెట్టి ఓటర్లను తొలగించడం సరికాదని ధ్వజమెత్తారు. (ఈసీ) ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పనిచేయాలని కానీ బిజెపి చేతిలో కీలుబొమ్మగా పనిచేస్తుందని అన్నారు ఇప్పటికే తొలగించినటువంటి ఓట్లను పునరుద్ధరించాలని నిజామాబాద్ జిల్లాలో 48 వేలకు పైగా ఓట్లు గల్లంతు అవుతున్నాయని వీరి ఓట్లు ఆధార్ తో అనుసంధానం చేయాలని కోరుతున్నామన్నారు. ఎస్ ఐ ఆర్ లు నిలిపివేయాలని, తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్తో అక్టోబర్ 1న నిజామాబాద్ ధర్నా చౌక్ లో జరిగే నిరసనలో పెద్ద ఎత్తున వామపక్ష పార్టీ నాయకులు,కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ బాబు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య,ఆర్ఎస్పి జిల్లా కార్యదర్శి కటారి రాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై ఓమయ్య నాయకులు అలీ ఇమ్రాన్, ఎం సిపిఐ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి కాజా మైనుద్దీన్,రాజన్న పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్ర సాధనకు అలుపెరగని పోరాటం చేసిన యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ

- జిల్లా ఇంచార్జి బీసీ అభివృద్ధి అధికారి రవీందర్
- ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మంత్రి పదవి రాజీనామా చేసిన త్యాగశీలి
- అట్టహాసంగా జరిగిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



పెద్దపల్లి,సెప్టెంబర్ 27(జనంసాక్షి) : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు అవిరళ కృషి చేసిన అలుపెరగని పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని జిల్లా ఇంచార్జి బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ అన్నారు.ఆదివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో జిల్లా ఇంచార్జి బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కొండా లక్ష్మణ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.జిల్లా ఇంచార్జి బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ మాట్లాడుతూ నిజాం పరిపాలన నుండి స్వాతంత్రం, దాని తర్వాత కూడా ఒక రూపం ఇవ్వాలని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం చేశారని, మన రాష్ట్రాన్ని కష్టపడి అభివృద్ధి చేసుకొని వారి ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. మాటలకు మాత్రమే పరిమితం కాకుండా , తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కొరకు మంత్రి పదవిని సైతం 1969 ఉద్యమ సమయంలో రాజీనామా చేసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని, అటువంటి మహనీయుల త్యాగాల ఫలితాలు నేటి తరానికి బంగారు బాటలు వేశాయన్నారు.కొండా లక్ష్మణ్ బాపూజీ సామాజిక అభ్యున్నతి కొరకు కృషి చేసిన మహనీయుడని, ఆనాటి పరిస్థితులను ఎదుర్కొని న్యాయవాదిగా పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించారని అన్నారు.హైదరాబాద్ రాష్ట్రంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసన సభ్యులుగా సేవలు అందించా రని, మలిదశ ఉద్యమానికి వేదిక అందించారని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిరంతరం శ్రమించిన మహనీయుల జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ ఏర్పాటులో కొండా లక్ష్మణ్ బాపూజీ కృషిని గుర్తించి ప్రభుత్వం ఉద్యానవన విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టిందని, అధికారికంగా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు.కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవితంలో సమాజ శ్రేయస్సు కోసం అనేక త్యాగాలు చేశారని, ఆ స్ఫూర్తి మనమంతా తీసుకొని ముందుకు సాగాలని, ఆయన కీర్తిని , చేసిన పనులను ప్రజలలోకి విస్తృతంగా తీసుకొని వెళ్లాలని అన్నారు.అంతకు ముందు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని వివిధ సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు, ఇతర ప్రజా ప్రతినిధులు,పద్మశాలి, బి.సి.కుల భాంధవులు,వివిధ కుల సంఘాల ప్రతి నిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ. ఓ.సిబ్బంది,ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్టీయూ టీఎస్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షులుగా యన్ రెడ్డి మహేశ్వర్,ప్రధాన కార్యదర్శి గాదె కోటేశ్వరరావు





సుల్తానాబాద్,సెప్టెంబర్ 27(జనంసాక్షి) : ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ సుల్తానాబాద్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.శనివారం సుల్తానాబాద్ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ బాలుర పాఠశాలలో మండల శాఖ సర్వసభ్య సమావేశాన్ని రెండు వేల ఇరవై ఆరు రెండు వేల ఇరవై ఎనిమిది సంవత్సరానికి సంబంధించి నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. సభ్యుల ఏకాభిప్రాయంతో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల శాఖ అధ్యక్షుడిగా ఎనెడ్డి మహేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా గాదె కోటేశ్వర్‌రావు,అసోసియేట్ అధ్యక్షుడిగా పి.ఎల్లయ్య,మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా ఎన్. ఆశాలత, ఉపాధ్యక్షుడిగా శివశరణం, మహిళా ఉపాధ్యక్షురాలిగా శెట్టి ప్రసన్నరాణి, కార్యదర్శిగా ఉమాశంకర్, మహిళా కార్యదర్శిగా సమత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎన్నికల అధికారిగా ఎలిగేడు మండల శాఖ అధ్యక్షుడు మిట్టపల్లి యుగంధర్ వ్యవహరించి ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. కార్యవర్గ ఎన్నిక అనంతరం సభ్యులు నూతన బాధ్యులను అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతోపాటు, సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా నూతన కార్యవర్గం సమన్వయంతో పనిచేయాలని పలువురు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు గండు కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు సంఘం తరపున నిరంతరం పోరాడాలని సూచించారు.ఈ సమావేశంలో రాష్ట్ర బాధ్యులు పెద్దపల్లి లచ్చయ్య, పిట్టల రవీందర్,జిల్లా బాధ్యులు దూడం సురేష్,రాజేంద్రప్రసాద్,వెంకట మాధవరావు,పల్లెర్ల సురేందర్ తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హాఫ్ మారథాన్‌లో సత్తా చాటిన సుల్తానాబాద్ పోలీసులు




సుల్తానాబాద్,సెప్టెంబర్ 27(జనంసాక్షి) : కరీంనగర్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్సై చంద్రకుమార్ తో పాటు మొత్తం 12 మంది పోలీస్ సిబ్బంది పాల్గొని విజయవంతంగా 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్ పరుగును పూర్తి చేశారు.పోలీసు విధులతో పాటు శారీరక దృఢత్వం, ఆరోగ్యం ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యతనిస్తూ సిబ్బంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండేందుకు క్రీడలు పరుగు వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.హాఫ్ మారథాన్ లో ఎస్సై చంద్రకుమార్ తో పాటు హెడ్ కానిస్టేబుల్ మహేందర్, కానిస్టేబుళ్లు దేవరాజు, సదానందం, గణేష్, వెంకటేష్, రమేష్, అరుణ్, హరీష్, యుగంధర్,చక్రవర్తి,విను స్టర్ ,అశోక్ లు పాల్గొన్నారు.

# బాధ్యతలు చేపట్టిన చాత్రాజ్ రమేష్

- అభినందించిన మాజీ ఎమ్మెల్యే గుజ్జుల,కడారి

సుల్తానాబాద్,సెప్టెంబర్ 27(జనంసాక్షి) : మండలంలోని, కొ దురుపాక గ్రామానికి చెందిన సీనియర్ బిజెపి నేత చాత్రాజ్ రమేష్ బిజెపి పెద్దపల్లి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షునిగా ఎన్నికై,ఆదివారం పదవి బాధ్యతలను చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా చాతురాజ్ రమేష్ ను పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు అభినందించి శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా పదవి బాధ్యతలను చేపట్టిన చాత్రాజ్ రమేష్ మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకంతో ఓ బి సి మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షునిగా పదవి అప్పగించినందుకు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజులలో పెద్దపల్లి జిల్లా లోని అన్ని మండలాలలో ఓ బి సి మోర్చా కమిటీలు వేసి బిజెపి పార్టీని బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు.వచ్చే ఎన్నికల వరకు పెద్దపల్లి జిల్లాలో బిజెపి బలమైన శక్తిగా ఎదుగుతుందని రమేష్ తెలిపారు.తన నియామకానికి సహకరించిన బిజెపి పెద్దలకు పార్టీ శ్రేణులకు,కార్యకర్తలకు, నాయకులకు,రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.



# చిలుక ఉదయ్ పై దాడి పిరికిపందల చర్య

- ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలి
- రోజురోజుకు పెరిగిపోతున్న దళితులపై దాడులు
- ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి
- ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ ను పకడ్బందీగా అమలు చేయాలి
- ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్మ యుద్ధం తప్పదు
- ధర్మ సమాజ్ పార్టీ నాయకులు ఆవు నూరి సతీష్ ఏదుల్ల శంకర్

సుల్తానాబాద్,సెప్టెంబర్ 27(జనంసాక్షి) : సుల్తానాబాద్ పట్టణం పూసాల రోడ్డులో నివాసం ఉంటూ, నందిని కాన్ఫెక్షనరీలో పనిచేస్తున్న చిలుక ఉదయ్ ను,కిడ్నాప్ చేసి కొంతమంది దుండగులు పైశాచికంగా దాడి చేసి చంపడానికి ప్రయత్నించడాన్ని, ధర్మసమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని,ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు ఆవునూరి సతీష్,ఎదుల్ల శంకర్ తీవ్రంగా ఖండించారు.దుండగులు ఎంతటి వారైనా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోజు రోజుకు దళితులపై దళిత మహిళ యువకులపై దాడులు జరిగిపోతున్నాయని, దాడుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ తీసుకొని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేశారు.దళిత యువకులపై దాడులు చేస్తే ధర్మసమాజ్ పార్టీ ఊరు కోదని, ఇటువంటి చర్యలు పిరికిపందలు చేసే పనని, అనవసరమైన నిందలు మోపు తూ దళిత యువకులపై దాడులు చేస్తే ఇకపై సహించమని చట్టం దుండగులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల ధర్మసమాజ్ పార్టీ బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. దాడికి కారణాలను నిజాలను నిష్పక్ష పాతంగా పోలీసు ఉన్నతాధికారులు బయటకు తీసి ఇంకా దోషులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కారణాల పేరుతో పైశాచిక దాడులు చేసే దుండగులను గుర్తించడంలో పోలీసులు చర్యలు తీసుకొని నిందితులకు శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దుండ గులు కారులో కిడ్నాప్ చేసి మద్యం సేవిస్తూ, చిలుక అజయ్ ను అటు ఇటు తిప్పుతూ హింసలకు గురి చేస్తూ ఎంత బ్రతిమాలిన వినకుండా కర్రలతో రాళ్లతో దాడులు చేసి చంపడానికి హేయమైన చర్యగా అభివర్ణించారు.ఇట్టి దాడిపై స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రజాస్వామ్యవాదులు పౌర హక్కుల నేతలు అంబేద్కర్ సంఘాల నాయకులు ఖండించాలని,దుండగులకు ఉరిశిక్ష పడేంత వరకు పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు.





## యువజన కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

**పెద్దపల్లి,సెప్టెంబర్ 27(జనంసాక్షి) :**
యువజన కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఇంఛార్జి అమీర్ అబ్దుల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో యువజన కాంగ్రెస్ సంస్థాగత కార్యక్రమాలు, మండలాల వారీగా పార్టీ కార్యకలాపాలు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, రానున్న కార్యక్రమాలపై సమీక్షించారు. యువతను పెద్ద ఎత్తున పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడంతో పాటు, యువత సమస్యలపై చురుకైన పాత్ర పోషించాలని చర్చించారు. ప్రతి గ్రామంలో యువతను సంఘటితం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు,కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాష్,పెద్దపల్లి అసెంబ్లీ అధ్యక్షుడు ముత్యాల నరేష్ ముదిరాజ్, జిల్లా,అసెంబ్లీ స్థాయి నాయకులు,వివిధ మండలాల అధ్యక్షులు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇటీవల లిపిడుగులిపడి మృతి చెందిన అంజమ్మ కుటుంబానికి అండగా నిలిచిన జిల్లా యాదవ సంఘం నాయకులు



**ధర్మారం,సెప్టెంబర్ 27(జనంసాక్షి) :**
ధర్మారం మండలం చామనపల్లి గ్రామానికి చెందిన మారం అంజవ్వ ఇటీవల అకస్మాత్తుగా పిడుగుపాటుతో మృతి చెందగా,ఇట్టి విషయాన్ని తెలుసుకున్న రాష్ట ,జిల్లా యాదవ సంఘం నాయకులు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి అనంతరం పెద్దపల్లి జిల్లా అండ్ రాష్ట యాదవ సంఘం నాయకులు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.వారు ఓదెల మండల మాజీ జెడ్పిటిసి లిగంట రాములు యాదవ్,యాదవ సంఘం జిల్లా అధ్యక్షులుమేకల మలేషం యాదవ్,పెద్దపల్లి బజాజ్ షోరూం అధినేత,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంధనవేని రాజేందర్ యాదవ్, రియల్ ఎస్టేట్ వ్యాపారి జిల్లా ప్రధాన కార్యదర్శి పెగడ రమేష్ యాదవ్,రామన్న స్నేహితుడు పెరక శ్రీను,మొత్తం రూపాయలు మృతురాలి కుటుంబ సభ్యులకుఅందజేయగా,ఈ కార్యక్రమంలో ధర్మారం మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు సంగ రంజిత్ యాదవ్,యాదవ సంగం జిల్లా ఉపాధ్యక్షులు,జూలపల్లి మాజీ సర్పంచ్ దారవేణి నరసింహా యాదవ్,సర్పంచ్ రవి యాదవ్, సుద్దాల మాజీ సర్పంచ్ సంపత్ యాదవ్,చామనపల్లి గ్రామానికి వచ్చి మృతిచెందిన అంజవ్వ కుటుంబన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసినందుకు గ్రామ సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

## రెడ్ క్రాస్ పెద్దపల్లి జిల్లా శాఖకు నూతన కార్యవర్గం ఎన్నిక

**పెద్దపల్లి,సెప్టెంబర్ 27(జనంసాక్షి) :**



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా శాఖకు నూతన కార్యవర్గం కొలువుదీరింది. శనివారం నిర్వహించిన ఎన్నికల్లో వివిధ హోదాలకు సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల ఫలితాలను సెప్టెంబర్ 26న ఎన్నికల అధికారి మరియు డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్ మెంట్ ఆఫీసర్ ముస్త్యాల రాజశేఖర్ ప్రకటించారు.నూతన కార్యవర్గంలో చైర్మన్‌గా ఎరబాటి వెంకటేశ్వర రావు,వైస్ చైర్మన్‌గా సాదుల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా పంపాటి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా కావేటి రాజగోపాల్ ఎన్నికైనట్లు ప్రకటించారు. జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఉప్పు రాజ్‌కుమార్, గంట్ల రామచంద్ర రెడ్డి, మహమ్మద్ అబ్దుల్ మోయిద్, మెడగోని వెంకటేష్, అల్వారి సంపత్ రావు,వేల్పుల రమేష్, గూళ్ల అంజన్ కుమార్, దుడం వెంకట సాంబమూర్తి ఎన్నికయ్యారు.ఎన్నికల ఫలితాల ప్రకారం నూతనంగా ఏర్పడిన కమిటీ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా శాఖ కార్యకలాపాలను కొనసాగించనుంది. ప్రజలకు సేవలు అందించడం, విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో సహాయక కార్యక్రమాలు చేపట్టడం వంటి రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల్లో నూతన కార్యవర్గం కీలక పాత్ర పోషించనుంది. ఎన్నికల కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం కమిటీ, కార్యనిర్వాహకుల పదవీకాలం ఎన్నిక జరిగిన తేదీ నుంచి మూడు సంవత్సరాలు కొనసాగుతుంది.ఈ మేరకు కమిటీ పదవీకాలం 05 అక్టోబర్ 2029తో ముగియనుంది.ఎన్నికల వివరాలను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి/సీఈఓకు సమాచారం కోసం కాపీగా సమర్పించినట్లు ఎన్నికల కార్యాలయం పేర్కొంది.

## చాకలి ఐలమ్మ పోరాట. స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శం

### - మాజీ ఎమ్మెల్యే దాసరిలి లిమనోహర్ రెడ్డి

పెద్దపల్లి,సెప్టెంబర్ 27(జనంసాక్షి) : వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే,బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి పాల్గొని ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి,పాలాభిషేకం చేసి ఆమెను స్మరించుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు,భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.పేదలు,అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని,అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె ప్రదర్శించిన తెగువ నేటి తరాలకు ఆదర్శమని దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్,కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, రజక సంఘం నాయకులు బొడ్డుపల్లి రమేష్, రామ్మూర్తి, కుమారస్వామి,అంజి బాబు,నవీన్ కుమార్,సంపత్,కృష్ణ,అశోక్, మల్లికార్జున్, మల్లయ్య,నాయకులు పెంచాల శ్రీధర్,పోదరి చంద్రశేఖర్ నాంసాని సరేష్ బాబు,బిక్షపతి,కాశి పాక వాసు,అఫ్జల్ బాబా,పల్లె మధు,నూగిల వీరేశం, రాజేష్,నిఖిల్,పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు,స్థానిక ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.






## గొర్రెలు మేకల బీమా పథకం చారిత్రాత్మకం

### - సీఎం చిత్రపటానికి పాలాభిషేకం
### - ఎమ్మెల్యే విజయ రమణారావు చొరవతోనే పథకం అమలు
### - యాదవ సంఘాల నేతల హర్షం

**పెద్దపల్లి,సెప్టెంబర్ 27(జనంసాక్షి) :**
రాష్ట్రంలో గొర్రెలు,మేకల పెంపకందారుల ఆర్థిక భరోసా కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బీమా పథకం జీవాల కాపరుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపిందని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం గొర్రెలు,మేకల పెంపకందారులు,యాదవ సంఘాల నాయకులు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ సీఎం రేవంత్ రెడ్డి,మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మారం తిరుపతి యాదవ్,జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్,వర్కింగ్ ప్రెసిడెంట్ సంధనవేణి రాజేందర్ యాదవ్‌లు మాట్లాడుతూ వ్యాధులు,ప్రమాదాలు,విషాహారం లేదా కుక్కల దాడి వల్ల జీవాలు మృతి చెందితే పెంపకందారులు తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయేవారని గుర్తుచేశారు.ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం బీమా సౌకర్యం తీసుకురావడం అభినందనీయమన్నారు.శనివారం కరీంనగర్‌లో లాంఛనంగా ప్రారంభమైన ఈ పథకం కింద ఒక్కో గొర్రె లేదా మేకకు రూ.3వేల బీమా రక్షణ లభిస్తుంది.ఇందుకు సంబంధించి మొత్తం ప్రీమియం రూ.88 కాగా,పెంపకందారుడు కేవలం రూ.13 చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన రూ.75లను ప్రభుత్వమే భరించి నిరుపేద కాపరులపై భారం పడకుండా చూసింది.గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నష్టపోయిన గొర్రెల కాపరుల సమస్యలను గుర్తించి,వారి తరఫున ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రత్యేక చొరవ తీసుకున్నారని నేతలు కొనియాడారు.ఈ సమస్యను పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి,సీఎం ఎ. రేవంత్ రెడ్డిల దృష్టికి తీసుకువెళ్లి ఒప్పించడంలో ఆయన చూపిన చొరవను యాదవ,కురుమ వర్గాలు ఎప్పటికీ గుర్తుంచుకుంటాయని పేర్కొన్నారు.పథకం అమలులో కృషి చేసిన ఫెడరేషన్ చైర్మన్ సరిత,ఎండీ సుబ్బారాయుడులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ పథకం ప్రతి గ్రామంలోని అర్హులైన పెంపకందారులందరికీ సులభంగా అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు పర్స బక్కయ్య,పెగడ రమేష్,తాత రాజు,సామ తిరుపతి,ఉప్పరి శ్రీనివాస్,ఉడుత పర్వతాలు,అట్ల సాగర్,నాగరాజు,సర్పంచులు గోగు రాజయ్య,మాధరవేణి మల్లేష్,ధారవేణి పోషన్న,దాడి చంద్రమౌళి,దాడి రవి,తాత సదానందం,అసరీ రాయమల్లు,నర్రా కుమార్,గట్టయ్య,బొడ్డు చంద్రయ్య,వినోద్,శ్రీనివాస్,రాజేశం,పొలవేని కుమార్,మేకల కుమార్,దాడి కనకయ్య,తదితరులు పాల్గొన్నారు.

## క్రీసెంట్ హై స్కూల్ లో విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు

**పెద్దపల్లి,సెప్టెంబర్ 27(జనంసాక్షి) :**
రామగుండం సి పి ఆదేశాల మేరకు శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని క్రీసెంట్ హై స్కూల్, విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు.అందులో భాగంగా షీ టీమ్ ఇంచార్జి ఎస్ ఐ లావణ్య మాట్లాడుతూ, గుడ్ టచ్ బాడ్ టచ్,గురించి విద్యార్థులు తెలియని వారి పట్ల ఎలా ఉండాలి,పోక్సో యాక్ట్ గురించి,సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది,విద్యార్థుల ప్రవర్తన నియామవాలి గురించి తెలిపారు.మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ గురించి తెలిపారు.ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిఘా ఉంటుందని,ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు.ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు.అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100/112 నంబర్ కు డయల్ చేయాలని, అలాగే ఆన్లైన్ మోసాలకు గురైతే 1930 కి ఫోన్ చేయాలనీ,మహిళలకు ప్రయాణ సమయం లో ట్రావెలింగ్ సేఫ్టీ అప్ టి సేఫ్ ఆప్ వాడాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో హెడ్ మాస్టర్ విజయ్,ఉపాధ్యాయులు మరియు షీ టీమ్ సభ్యులు,మౌనిక,స్నేహలత పాల్గొన్నారు.



## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల కళాశాలకు సొంత భవనం మంజూరు చేయాలి

**- కేటాయించిన భూమిని రక్షించాలి - తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ విజయ రమణారావు కు వినతిపత్రం అందజేత**

**ఎలిగేడు,సెప్టెంబర్ 27(జనంసాక్షి) :**
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల కళాశాల పెద్దపల్లి నుండి సుల్తానాబాద్ కు వసతి గృహం భవనం మంజూరు చేయాలని కోరుతూ తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు కు శివపల్లి లోని తన నివాసంలో ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. 2017 లోని వసతి గృహానికి సంబంధించిన భూమి సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ లో అప్పటి జిల్లా ఇన్చార్జి కలెక్టర్గా ఉన్న ప్రభాకర్ రెడ్డి భూమిని కేటాయించడం జరిగిందని,కానీ భూమి కేటాయించినప్పటికీ సొంత భవనం మంజూరు కావడంలేదని ఎమ్మెల్యే,విజయ రమణారావు దృష్టికి తీసుకువెళ్లారు.



సొంత భవనం మంజూరు కాకపోవడం వల్ల దానికి కటాయించిన భూమి అన్యక్రాంతం అవుతుందని తెలిపారు. సొంత భవనం లేకపోవడం వల్ల ప్రస్తుతం కొనసాగుతున్న అద్దె భవనంలో అనేక సమస్యలు ఉండడం,కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే విజయ రమణారావు,కు వినతి పత్రం అందజేశారు. ముందుగా ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే ఇటీవల మంత్రి హోదా రావడం పై మర్యాదపూర్వకంగా శాలువా కప్పి సన్మానం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వసతి గృహ భవనం మంజూరు చేయాలని అన్యక్రాంతమైన భూమిని రక్షించాలని ఎమ్మెల్యే విజయ రమణారావును కోరారు. స్పందించిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ఈ విషయంపై ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి భవనం మంజూరు చేసేందుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల కళాశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బందెల రాజశేఖర్,వైస్ చైర్మన్ లంక దాసరి భాస్కర్, ప్రధాన కార్యదర్శి గుండేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వార్డు మెంబర్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శిగా ఆవునూరి సతీష్ ఎన్నిక



**సుల్తానాబాద్,సెప్టెంబర్ 27(జనంసాక్షి) :**
వార్డు మెంబర్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని రాముని పల్లి గ్రామానికి చెందిన నాయకులు, వార్డు మెంబర్ ఆవునూరి సతీష్ ఆదివారం జరిగిన వార్డు మెంబర్ల,ఫోరం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆవునూరి సతీష్ మాట్లాడుతూ వార్డు మెంబర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వార్డు మెంబర్లకు తగిన గుర్తింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వార్డు సభ్యుల సంఘం నూతన కమిటీ



**సుల్తానాబాద్,సెప్టెంబర్ 27(జనంసాక్షి) :**
మండల వార్డు సభ్యుల సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఇన్చార్జి తపట్ల మోహన్, నియోజకవర్గ ఇన్చార్జి తీగల అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా గుర్రం రమేష్‌గౌడ్,ఉపాధ్యక్షుడిగా కల్లేపల్లి దేవేందర్,జనరల్ సెక్రటరీగా తిప్పారపు లక్ష్మణ్,జాయింట్ సెక్రటరీగా మేకల శ్రీకాంత్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.



## మానుష కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుదాం..

**- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రమేష్..**

**గోదావరిఖని, జనంసాక్షి :**
జ్యోతిరావు పూలే స్థాపించిన 'సత్యశోధక్ సమాజ్ 154వ ఆవిర్భావ వార్షికోత్సవం'సందర్భంగా పెద్దంపేట్ భగత్‌సింగ్ భవన్‌లో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అంతర్గాం సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కుల నిర్మూలన సదస్సు ఆదివానం నిర్వహించారు. సదస్సులో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు తోకల రమేష్ మాట్లాడుతూ సమస్త సంపదలను సృష్టించే శ్రామిక వర్గాలను కులాల వారిగా విభజించిన కుల వ్యవస్థను,దానిని కాపాడుతున్న సనాతన ధర్మాన్ని, మనువాదాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో 'మహాత్మ జ్యోతిరావు పూలే 1873 సెప్టెంబర్ 24న సత్యశోదక్ సమాజ్ స్థాపించారని, ఈ సంస్థ ఏర్పాటు కుల నిర్మూలన పోరాటంలో ఒక విప్లవాత్మకమైన ముందడుగని సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావం మన దేశంలోని ఎన్నో సంస్థలకు, పార్టీలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది అన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా ఏర్పడి కొనసాగుతున్న కుల వ్యవస్థ దానికి ఆలంబనగా నిలుస్తున్న చాందస మనువాదానికి వ్యతిరేకంగా పోరాడే ప్రగతిశీల అభ్యుదయ శక్తులకు కర్తవ్యాన్ని నిర్దేశించే ముఖ్యమైన సందర్భం అని ఆయన అన్నారు. అందుకే 'సత్యశోధకు సమాజ్ 154 ఆవిర్భా దినోత్సవం'లో భాగంగా సెప్టెంబర్ 24 నుండి 30 వరకు వారం రోజుల పాటు కుల నిర్మూలన అవగాహన ప్రచార ఉద్యమానికి ఆచరణాత్మక కార్యక్రమాలకు సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ,రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తుందన్నారు.
ప్రత్యేకించి దళితుల భూములను బలవంతంగా గుంజుకోవటానికి వ్యతిరేకంగానూ అమానుషమైన కుల వ్యవస్థకు వ్యతిరేకంగానూ, ప్రజలను చైతన్యవంతం చేసి నిలబెట్టాలని పోరాడాలని అన్నారు. ఆర్ఎస్ఎస్-బిజెపిల హిందుత్వ రాజకీయాలు దేశంలో గత పదేళ్లకు పైగా అధికారంలో స్థిరపడుతున్న కొద్ది ధనిక వర్గాల పునాదిని కాపాడుకుంటూనే అణగారిన కులాలలో కులతత్వాన్ని పెంచుతూ తమ రాజకీయ పునాదిని విస్తరించుకుంటున్నాయని అన్నారు. మొత్తంగా హిందూ దేశమే ముస్లిముల నుండి లోక్రిస్టియన్స్‌ల నుండి కమ్యూనిస్టుల నుండి ప్రమాదం ఎదుర్కొంటుందని హిందుత్వ విద్వేశ అబద్ధపు ప్రచారాలతో అణగారిన కులాలను సమీకరిస్తున్నాయని అన్నారు. హిందూ సంస్కృతి పరిరక్షణ పేరుతో అగ్రవర్ణ ఆధిపత్య సంస్కృతిని కులాలను సమర్థించే సనతన ధర్మాలను అణగారిన కులాల పసి పిల్లల మెదలలోకి పాఠశాలల ద్వారా ఎక్కిస్తున్నారని అన్నారు. ఈ సదస్సుకు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల నాయకులు, వార్డ్ మెంబర్ మాలేం తిరుపతి అధ్యక్షత వహించగా సిపిఐ(ఎం ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఈ.నరేష్, జి.సత్యనారాయణరెడ్డి,మేరుగు చంద్రయ్య, కొల్లూరి మల్లేష్, పైడిపల్లి రమేష్, అరుముల్ల తిరుపతి, ఐ.రాజేశం, దూలం సతీష్, ఈదునూరి బాబు, బండి సతీష్, పొనగంటి క్రాంతికుమార్,తూల్ల గట్టయ్య,ఉప్పులేటి లింగయ్య,తదితరులు పాల్గొన్నారు.

## మైనింగ్ స్టాఫ్‌కు హక్కులు సాధించిన చరిత్ర ఏఐటీయూసీది..

**- టీబీజీకేఎస్ 11 సంవత్సరాలు మైనింగ్ స్టాఫ్‌కు ఎలాంటి హక్కులు సాధించలేదు..**

**- పాలక ప్రభుత్వాల రాజకీయ జోక్యం వల్ల సింగరేణికి నష్టం జరుగుతోంది..**

**- ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య..**

గోదావరిఖని, జనంసాక్షి :
సింగరేణిలో పని చేస్తున్న మైనింగ్ స్టాఫ్‌కు హక్కులు సాధించిన చరిత్ర ఏఐటీయూసీదేనని, పాలక ప్రభుత్వాల రాజకీయ జోక్యం వల్ల సింగరేణికి నష్టం జరుగుతోందని, సంస్థ పరిరక్షణ కోసం,కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖనిలోని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన రామగుండం రీజియన్ మైనింగ్ స్టాఫ్ జనరల్ బాడీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో పని చేస్తున్న మైనింగ్ స్టాఫ్‌కు చార్జి అలవెన్సులు,ప్రమోషన్లు, అండర్ గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయిన వారికి సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇప్పించడం జరిగిందని తెలిపారు. డిస్మిస్ అయిన జేఎంఈటీలకు తిరిగి ఉద్యోగాలు ఇప్పించడం జరిగిందని పేర్కొన్నారు. మైనింగ్ ఇండస్ట్రీకి మైనింగ్ స్టాఫ్ చాలా ముఖ్యమని అన్నారు. గత టీబీజీకేఎస్ యూనియన్ 11 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు చేసిన ఒక్క అగ్రిమెంట్ తప్పుల తడకగా ఉందని,అందులో అన్యాయం జరిగిందని,ఆ అగ్రిమెంట్‌ను పారా మెడికల్ సిబ్బంది కాల్చివేశారని గుర్తు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న జేఎంఈటీలకు హెడ్ ఓవర్ మెన్ లుగా ఖాళీలతో నిమిత్తం లేకుండా, ఆగస్టు 27న లేబర్ కమిషనర్ వద్ద జరిగిన అగ్రిమెంట్ ద్వారా ప్రమోషన్లు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరిందని తెలిపారు.
మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి మాట్లాడగా ఈ సమావేశానికి మైనింగ్ స్టాఫ్ నాయకులు పెర్క మహేందర్ అధ్యక్షత వహించారు. కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజారత్నం, బ్రాంచి కార్యదర్శులు రంగు శ్రీను, గంధం సాంబశివరావు,బెల్లంపల్లి రీజియన్ మైనింగ్ స్టాఫ్ నాయకులు వంగ రాజేశ్వరరావు, రీజియన్ పరిధిలోని మైనింగ్ స్టాఫ్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రేడ్ ఎక్స్ పోస్టర్ ఆవిష్కరించిన మేయర్ మహంకాళి స్వామి..

గోదావరిఖని, జనంసాక్షి :



హైదరాబాద్ శంషాబాద్‌లో జరుగుతున్న ఫోటో ట్రేడ్ ఎక్స్ పోస్టర్‌ను రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం ప్రతి సంవత్సరం జరిగే ఈ ట్రేడ్ ఎక్స్ పోస్టర్ ప్రతి ఒక్క ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ నైపుణ్యాన్ని పెంచుకొవటానికి కొత్త టెక్నాలజీని అప్డేట్ చేసుకోవటానికి ఇలాంటి ట్రేడ్ ఎక్స్ ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరు ఈ ట్రేడ్ ఎక్స్‌కు వెళ్లి నైపుణ్యాన్ని పెంచుకోవాలని మేయర్ సూచించారు. వచ్చే నెల 4న (ఆదివారం) ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎక్స్‌కు బస్సులో వెళ్లడానికి సిద్దంగా ఉండాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు నెలికంటి రాము, దాసరి సాంబమూర్తి, గడ్డం శ్రీనివాస్, సంజీవ్, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శనిగరపు మల్లేష్, ప్రధాన కార్యదర్శి దుస్స మహేష్, కోశాధికారి రామగిరి శ్రీనివాస్, రాష్ట్ర మాజీ మహిళ ప్రధాన కార్యదర్శి దమ్మాల తులసి, రెడ్డి భాస్కర్, చిప్ప కుమారస్వామి, గడమల్ల రఘు,ఎంబరి గంగాధర్, దాగం రాకేష్, కోడి రామకృష్ణ, దాసరి కిషోర్, మోరవిక్రమ్,దాసరి కిరణ్,బిసాడి శివప్రసాద్,ములుకుంట్ల శ్రీనివాస్,నస్పూరి రమేష్,కల్లెపల్లి సాగర్, తదితర 50 మందికి పైగా ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లా బీజేపీ లేబర్ సెల్ విభాగం కో-కన్వీనర్‌గా ఎల్తూరి రాజయ్య..



గోదావరిఖని, జనంసాక్షి : స్థానిక జీఎం కాలనీకి చెందిన ఎల్తూరి రాజయ్యకు బీజేపీ జిల్లా అధ్యక్షులు కర్ర సంజీవరెడ్డి, రామగుండం నియోజకవర్గ ఇంచార్జి కందుల సంధ్యారాణి పెద్దపల్లి జిల్లా బీజేపీ లేబర్ సెల్ విభాగం కో-కన్వీనర్‌గా ఎల్తూరి రాజయ్యకు కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ తడగొండ నర్సయ్య నియామక పత్రాన్ని ఆదివారం అందించారు. బీజేపీ సిద్ధాంతం,సమాజం పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, సమర్థవంతమైన సేవలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నారు. అప్పగించిన ఈ బాధ్యతను అంకిత భావంతో నిర్వహిస్తూ కార్మికుల సంక్షేమానికి,సంస్థ బలోపేతానికి మరింత కృషి చేస్తారని అశిస్తున్నామని సంధ్యారాణి తెలిపారు. పార్టీ కమీటీలతో కలిసి అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారని,ఈ ప్రాంతంలో అసంఘటిత రంగంలోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఉద్యమాలు చేపట్టి వారి సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. పార్టీ సంస్థాగతంగా పటిష్ఠపరిచి అన్ని వార్డులలో మరింత విస్తరించడానికి కృషి చేస్తారని అశిస్తున్నానని సంధ్యారాణి పేర్కొన్నారు. అనంతరం ఎల్తూరి రాజయ్య మాట్లాడుతూ బీజేపీ లేబర్ సెల్ విభాగం కో-కన్వీనర్‌గా నియమించినందుకు బీజేపీ జిల్లా అధ్యక్షులు కర్ర సంజీవరెడ్డి,రామగుండం నియోజకవర్గ ఇంచార్జి కందుల సంధ్యారాణి, బీజేపీ లేబర్ సెల్ రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్, పెద్దపెల్లి జిల్లా లేబల్ సెల్ కన్వీనర్ తడగొండ నర్సయ్య కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## 'ఖని'లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు..



**గోదావరిఖని, జనంసాక్షి :**
స్థానిక మార్కండేయకాలనీలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఆయన జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం నాయకులు,కార్యకర్తలు కూడా విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనకు నివాళులు అర్పించారు.అనంతరం కందుల సంధ్యారాణి మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ సమాజం కోసం చేసిన సేవలు, ప్రజా సమస్యలపై ఆయన సాగించిన పోరాటం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరకొండ అపర్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుల్వ లక్ష్మీనర్సయ్య, తాడగొండ నర్సయ్య, ఎల్తూరి సరిత, రాజయ్య,శ్రీనివాస్‌యాదవ్,బొంగ మహేష్, జక్కుల ప్రవీణ్, బియ్యాల మహేందర్, అరుకొండ తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ప్రకటించాలి

**- జాతీయ యువజన అవార్డు గ్రహీత, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు అలువాల విష్ణు..**



రామడుగు(జనంసాక్షి):
ప్రముఖ స్వాతంత్ర్య, సమర యోధులు బడుగు బలహీన వర్గాల చేనేత ముద్దుబిడ్డ తెలంగాణ తొలి ఉద్యమ ధృవతార మాజీ మంత్రివర్యులు,ఉద్యమాల పితామహుడు తెలంగాణ జాతిపిత శ్రీ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ గారికి భారతరత్న ప్రకటించాలి అని పద్మశాలి సంఘం అధ్యక్షులు కొలిపాక మల్లయ్య జాతీయ యువజన అవార్డు గ్రహీత, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు అలువాల విష్ణు లు అన్నారు.ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా పద్మశాలి సంఘం గోపాల్ రావు పేట ఆధ్వర్యంలో ఆదివారం సంఘం భవనం లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు బడుగు బలహీన వర్గాల చేనేత ముద్దుబిడ్డ తెలంగాణ తొలి ఉద్యమ ధృవతార మాజీ మంత్రివర్యులు తెలంగాణ జాతిపిత శ్రీ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అనే పేరు సమస్త ఉద్యమాలకు చిరునామా అని.చారిత్రక నైజాం వ్యతిరేక పోరాటం నుంచి ఇటీవలి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం దాకా రాష్ట్ర రాజకీయాల్లో బాపూజీ తనదైన ముద్ర వేశారు అని, బాపూజీ జీవితాన్ని నేటితరం నాయకులకు ఆదర్శం వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వనజ నరేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి కొలిపాక కమలాకర్ రాపల్లి శ్రీనివాస్ మచ్చ గంగయ్య రుద్ర నాగరాజ్ కొలిపాక నాగరాజ్ గోనె రాజు లక్ష్మణ్ శ్రీనివాస్ మామిడాల నాగరాజు కమలాకర్ రుద్రరాజు భూమయ్య మల్లేశం జగదీష్ రాములు లక్ష్మీనారాయణ సత్యనారాయణ రామచంద్రం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



**ముస్తాబాద్ సెప్టెంబర్ 27 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండల కేంద్రంలో ఆదివారం పద్మశాలి సంఘం అధ్యక్షులు తడుక బాలకిషన్ ఆధ్వర్యంలో కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం అని పేర్కొన్నారు. దేశ స్వతంత్రం కోసం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, తెలంగాణ కోసం మంత్రి పదవిని వదిలి, తొలి తరం ఉద్యమంలో భాగస్వాములు అయినారని, చేనేత సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు గౌడ కృష్ణాహరి,బిట్ల దేవానందం, గౌడ సహదేవ్, గౌడ మల్లేశం, ఆమంచి సత్యనారాయణ, ఆమంచి వంశీ,ఆడెపు సత్యనారాయణ పాల్గొన్నారు.



**8 ఇంక్లైన్ కాలనీ పట్టణంలోని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో స్వర్గీయ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సేవా సంఘం ప్రధాన కార్యదర్శి సాంబారి రాజేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి 18వ డివిజన్ కార్పొరేటర్, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు దేవనపల్లి చక్రపాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.**

## రామగుండం కమిషనరేట్‌లో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు..

**- కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం..**

**- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా..**



**గోదావరిఖని, జనంసాక్షి :**
స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ దేశానికి,తెలంగాణకు చేసిన సేవలను స్మరించుకున్నారు.స్వాతంత్ర్య ఉద్యమంలో, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన దశాబ్దాల పాటు అలుపెరగని కృషి చేశారని తెలిపారు.మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇల్లు,ఆస్తులను సైతం అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు.కొండా లక్ష్మణ్ బాపూజీ 1915 సెప్టెంబర్ 27న ప్రస్తుత కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గ్రామంలో జన్మించారని సీపీ తెలిపారు.1952లో ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి తొలిసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన ఆయన, అనంతరం 1967, 1972 సంవత్సరాల్లో భువనగిరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు.1957 నుంచి 1960 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ, అనంతరం దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలో ఎక్సైజ్,చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక,సమాచార శాఖ మంత్రిగా సేవలందించారని తెలిపారు.1969లో జరిగిన తొలి దశ తెలంగాణ ఉద్యమంలోనూ కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని సీపీ పేర్కొన్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమిస్తూ ఇందిరాపార్క్ వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టడంతో పాటు, ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కూడా సత్యాగ్రహం నిర్వహించారని గుర్తుచేశారు.ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆయన ప్రదర్శించిన పోరాట పటిమ, త్యాగం,నిబద్ధత భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు.దేశసేవకు, ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,ఆర్ఐ మల్లేశం,వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది,ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి..

**- నగర మేయర్ మహంకాళి స్వామి..**



**గోదావరిఖని, జనంసాక్షి :**
కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు.కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి పురస్కరించుకొని ఆదివారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం మొత్తం పోరాటాలు, త్యాగాల సమాహారం అని అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలో 1915 సెప్టెంబర్ 27న జన్మించిన బాపూజీ చిన్నతనం నుంచే అన్యాయాలపై తిరగబడ్డారని అన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో భాగంగా 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని ఆయన జైలుకు వెళ్లారని,ఆ తర్వాత తెలంగాణను పీడిస్తున్న నిజాం నవాబు క్రూర పాలనకు వ్యతిరేకంగా,రజాకార్ల అరాచకాలకు ఎదురొడ్డి సాయుధ పోరాటంలో చురుకైన పాత్ర పోషించారని అన్నారు.తొలిదశ,మలి దశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ఆయన తెలంగాణ రాష్ట్రం రాక ముందే మరణించడం దురదృష్టకరమని అన్నారు. వెనుకబడిన తరగతుల,దళిత, గిరిజన ప్రజల హక్కుల కోసం ఆయన నిరంతరం శ్రమించారని ముఖ్యంగా చేనేత కార్మికుల సంక్షేమం కోసం పద్మశాలీ సంఘాన్ని బలోపేతం చేసి, వారి ఆర్థికాభివృద్ధికి ఆప్కో సంస్థ స్థాపనలో కీలకపాత్ర పోషించారని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, కార్పొరేటర్లు వెంగళ బాపు,ముస్తాఫా,గట్ల రమేష్, ధూళికట్ట సతీష్,నాయకులు మారెల్లి రాజిరెడ్డి,రంజిత్, అభిషేక్,పద్మశాలి సంఘం నాయకులు, ఆడెపు శంకర్, బూర్ల దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి.సర్పంచ్ మాధరి శ్రీనివాస్



**గన్నేరువరం, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):**
ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజా సేవలో ముందుకు సాగాలని మాదాపూర్ సర్పంచ్ మాధరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మాదాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నిరంకుశ నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ కొమరంభీం జిల్లా వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న జన్మించారని అన్నారు. నిజాం వ్యతిరేక ఉద్యమంలో, 1969 తొలి దశ మరియు మలిదశ తెలంగాణ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారని, నిఖార్సయిన తెలంగాణ వాదిగా 1969లో తెలంగాణ కోసం మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదిలేసిన త్యాగశీలి అని కొనియాడారు. రాష్ట్ర చేనేత సహకార రంగానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బాపూజీ చేసిన పోరాటం, త్యాగం, ప్రజాసేవ స్ఫూర్తిదాయకమని, ఆయన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గొడుగు స్వామి యాదవ్, మాడుగుల రామకృష్ణారెడ్డి, బండి తిరుపతి, గొడుగు చంద్రయ్య, సంపతి మహేందర్, సంపతి మొండయ్య తదితర నాయకులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.